





# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 1 సంచిక : 273 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ సోమవారం 10 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 273 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD MON 10 AUGUST 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur





## బోనాలకు నిధులెందుకు తగ్గించారు?..

### ప్రభుత్వాన్ని నిలదీసిన బండి సంజయ్

**హైదరాబాద్ పెన్ పవర్:** బోనాల ఉత్సవాల సందర్భంగా కేంద్ర మంత్రి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల పై తీవ్రవిమర్శలు చేశారు. హిందూ సమాజం, సనాతన ధర్మం విషయంలో ఆ రెండు పార్టీలు సంతుష్టీకరణ రాజకీయాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. బీజేపీ మాత్రం సంతుష్టీకరణ రాజకీయాలకు వ్యతిరేకమని స్పష్టం చేశారు. బోనాలను రాష్ట్ర పండుగగా ప్రకటించిన ప్రభుత్వం ఉత్సవాల నిర్వహణకు తగినన్ని నిధులు కేటాయించడం లేదని బండి సంజయ్ విమర్శించారు. హైదరాబాద్‌లో వేలాది ఆలయాలు ఉన్నప్పటికీ బోనాల ఉత్సవాలకు కేటాయిస్తున్న నిధుల పై ప్రభుత్వం పునరాలోచించాలని డిమాండ్ చేశారు. ఇతర పండుగలకు కేటాయించే నిధులతో పోల్చితే బోనాలకు ఎందుకు తక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని ప్రశ్నించారు.

- మిగతా 2లో



## ఫ్లెక్సీ వివాదం..

### బీఆర్ఎస్, కాంగ్రెస్ వర్గాల మధ్య ఘర్షణ

**హైదరాబాద్ పెన్ పవర్:** బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత మాధవరెడ్డి వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గోమారంలో ఆదివారం బోనాల సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల విషయంలో వివాదం రాజుకుంది. పోలీసులు ఫ్లెక్సీలు తొలగించి సర్ది చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం తమపై దాడి చేశారని ఇరు వర్గాల కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పరస్పరం పోలీసులను ఫిర్యాదు చేశారు.



## కన్నుల పండువగా లాల్‌దర్వాజా బోనాలు

### లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర వైభవంగా నిర్వహణ

- అమ్మవారి దర్శనం కోసం భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పణ
- హైదరాబాద్ బోనాల నిర్వహణకు ప్రభుత్వం రూ.20 కోట్లు కేటాయింపు

**హైదరాబాద్ పెన్ పవర్:** పాతబస్తీలోని ప్రసిద్ధ లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర ఆదివారం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా జరిగింది. అమ్మవారి దర్శనం కోసం నగరం నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో లాల్‌దర్వాజా పరిసరాలు కిక్కిరిసిపోయాయి. మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలు సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆషాఢ బోనాల ఉత్సవాల్లో భాగంగా మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ఎంపీలు అనిల్‌కుమార్ యాదవ్, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు, దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హైదరాబాద్ బోనాలకు ప్రత్యేకమైన చారిత్రక, సాంస్కృతిక గుర్తింపు ఉందని అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా బోనాల ఉత్సవాలను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. హైదరాబాద్ బోనాల కోసం ప్రభుత్వం రూ.20 కోట్లు కేటాయించిందని తెలిపారు. భవిష్యత్తులో బోనాల నిర్వహణను మరింత మెరుగ్గా చేపడతామని, సింహవాహిని మహంకాళి ఆలయంతో పాటు పరిసర ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని

- మిగతా 2లో



## నల్సార్ స్నాతకోత్సవానికి సీజేఐ వద్దు..

### విద్యార్థుల నిరసన!

- నల్సార్ స్నాతకోత్సవానికి సీజేఐ సూర్యకాంత్‌ను పిలవొద్దని విద్యార్థుల డిమాండ్
- దాదాపు 450 మంది విద్యార్థులు సంతకాలు చేసి యాజమాన్యానికి లేఖ అందజేశారు
- నీట్ నిరసనలపై సీజేఐ చేసిన వ్యాఖ్యలే అభ్యంతరాలకు కారణంగా వెల్లడి
- ఇటీవలే ముంబై టిస్‌లోనూ ఇదే తరహా నిరసనలతో స్నాతకోత్సవం వాయిదా
- డిమాండ్ నెరవేరకపోతే ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని విద్యార్థుల హెచ్చరిక

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా స్నాతకోత్సవానికి భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించడాన్ని

- మిగతా 2లో

## మావోయిజం ఖతం అనుకునేలోపే.. మరో భూతం రాష్ట్రాన్ని చుట్టేస్తోంది

### డీజీపీ సీవీ ఆనంద్ సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో నక్సలిజం (మావోయిజం) పూర్తిగా అంతమైందని, రాష్ట్ర భద్రతకు ఇక ఎలాంటి ముప్పు లేదని రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. మారుతున్న కాలానికి, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పోలీస్ శాఖలో సమూల మార్పులు చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. రాష్ట్రంలో శాంతి భద్రతల

- మిగతా 2లో

## పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి కేసీఆర్ పరామర్శ..

### రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం అందజేత

- నల్లబెల్లిలో దివంగత ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదినకర్మ
- హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించిన కేసీఆర్
- రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం చెక్కులు అందజేత
- సుదర్శన్‌రెడ్డితో అనుబంధాన్ని గుర్తుచేసుకుని భావోద్వేగం
- పార్టీ అండగా ఉంటుందని కుటుంబానికి భరోసా

**హైదరాబాద్ పెన్ పవర్::** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ వరంగల్ జిల్లా నల్లబెల్లిలో పర్యటిం చారు. ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదినకర్మ కార్యక్ర మంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించి, వారికి పార్టీ

- మిగతా 2లో





## రష్యా నుంచి భారత్‌కు రైలు మార్గం.. సరికొత్త కారిడార్‌పై భారీ ప్లాన్!

- భారత్‌తో రైల్వే కనెక్టివిటీ ఏర్పాటుకు రష్యా ప్రయత్నాలు
- హిందూ మహాసముద్రానికి ప్రత్యామ్నాయ భూమార్గంపై దృష్టి
- తుర్క్‌మెనిస్థాన్, ఇరాన్, ఆఫ్ఘనిస్థాన్, పాక్ మీదుగా మార్గం పరిశీలన
- కీలక సముద్ర జలసంధులపై ఆధారపడటం తగ్గించుకోవడమే లక్ష్యం
- ప్రతిపాదన ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని స్పష్టం చేసిన రష్యా

**పెన్ పవర్ డెస్క్:** భారత్‌తో నేరుగా రైల్వే కనెక్టివిటీని ఏర్పాటు చేసి, తద్వారా హిందూ మహాసముద్రానికి భూమార్గం ద్వారా చేరుకునే అవకాశాలపై రష్యా అన్వేషిస్తోంది. ఈ భారీ ప్రాజెక్టుపై మాస్కో తీవ్రంగా దృష్టి సారించిందని, ప్రత్యామ్నాయ రవాణా మార్గాలను అభివృద్ధి చేయడంలో భాగంగా ఈ ప్రణాళికను పరిశీలిస్తున్నామని రష్యా ఉప ప్రధాని

- మిగతా 2లో

## ఇజ్రాయెల్‌లో మిలిటరీ సెలవులు రద్దు... ఇరాన్‌పై దాడుల కోసమేనా.?

**పెన్ పవర్ డెస్క్:** ఇజ్రాయెల్ లో సైనికులకు ఉన్న అన్ని సెలవుల ను ఆ దేశ ఆర్మీ రద్దు చేసినట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. ఇప్పటికే సెలవుల్లో ఉన్న వారు వెంటనే తిరిగి సైన్యంలో చేరాలని ఆదేశాలు జారీ చేసింది.

- మిగతా 2లో



## బ్రహ్మోస్‌కు ప్రపంచవ్యాప్తంగా పెరిగిన గిరాకీ.. కొనుగోలుకు క్యూ కడుతున్న దేశాలు!

- ఆపరేషన్ సిందూర్‌తో బ్రహ్మోస్‌కు అంతర్జాతీయంగా భారీ డిమాండ్
- పాక్ వద్ద ఉన్న చైనా ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను విజయవంతంగా ఛేదించిన క్షిపణి
- వియత్నాం, ఇండోనేషియాతో వందల మిలియన్ డాలర్ల విలువైన ఒప్పందాలు ఖరారు
- పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా దేశంలోని నాలుగు కేంద్రాల్లో ఉత్పత్తి వేగవంతం
- భవిష్యత్తులో జలాంతర్గత, సూక్ష్మ వేరియంట్ల అభివృద్ధిపై శాస్త్రవేత్తల దృష్టి

**పెన్ పవర్ డెస్క్:** భారత అమ్ములపొదిలోని బ్రహ్మోస్ సూ పర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణికి అంతర్జాతీ యంగా గిరాకీ అ మాంతం పెరిగింది. ముఖ్యంగా, 'ఆపరేష న్ సిందూర్' సమయంలో ఈ క్షిపణి చూపిన అద్భుతమైన పనితీరు, దాని కచ్చితత్వం, విధ్వంసక శక్తి ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించాయి. ఈ ఆపరేషన్ తర్వాత బ్రహ్మోస్ కొనుగోలుకు పలు దేశాలు తీవ్ర ఆసక్తి చూపుతుండగా,




- మిగతా 2లో

## మమతా బెనర్జీ కారుపై దాడి

**పెన్ పవర్ డెస్క్:** పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి చేదు అనుభవం ఎదురైంది. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని ఓ టీఎంసీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తున్న ఆమె వాహనాన్ని నిరసనకారులు చుట్టుముట్టారు. ఆమెకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కారుపై బురద చల్లడంతోపాటు చెప్పులు, రాళ్లు విసిరినట్లు తెలుస్తోంది. ఈ ఘటనను మమతా బెనర్జీ తీవ్రంగా ఖండించారు. రాష్ట్రం గూండాల

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

## ఏపీ, తెలంగాణ రాష్ట్రాలపై ఎల్ నినో ఎఫెక్ట్... నీటి ఇబ్బందులు తప్పవా?

ఎల్ నినో ప్రభావం తెలుగు రాష్ట్రాలపై పడుతోంది. ప్రాజెక్టులకు వరద నీరు చేరుతున్నప్పటికీ వాటిని వదిలే విషయంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలకు పెద్ద టాస్క్ కానుంది. ఇప్పుడున్నపరిస్థితుల్లో సాగునీటికి ప్రాధాన్యం ఇచ్చే అవకాశం లేదు. కేవలం తాగునీరు, పశువులకు మాత్రమే అందించగలుగుతామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఎల్ నినో ఎఫెక్ట్ తో ఈసారి రెండు రాష్ట్రాలు రైతులు ఇబ్బందులు పడే అవకాశాలున్నాయి. శ్రీశైలం ప్రాజెక్టుకు వరద నీరు చేరుతున్నప్పటికీ ఇంకా పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకోలేదు. అదే సమయంలో గేట్లు కూడా ఎత్తలేదు. దీంతో జలవిద్యుత్తు కూడా ఇప్పటి వరకూ శ్రీశైలం ఎడమ, కుడి జల విద్యుత్తు కేంద్రాల్లో ప్రారంభం కాలేదు.

**అనుకున్న స్థాయిలో...**

ఆంధ్రప్రదేశ్ లో ఇటీవల వానలు కురిసినప్పటికీ అనుకున్న స్థాయిలో పడలేదు. దీంతో గోదావరికి కొంత వరద నీరు చేరినా అవి రైతులకు వ్యవసాయం కోసం చేరే అవకాశాలు కనిపించడం లేదు. గోదావరి, కృష్ణా నదుల్లో ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలను సాగుకు వదిలే అవకాశం లేదని ఏపీ వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. కేవలం తాగునీరుకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తామని, అలాగే పశువులకు అవసరమైన నీటిని అందించాలని ప్రభుత్వం నుంచి సాగునీటి పారుదల శాఖ అధికారులకు ఆదేశాలు అందాయి. ఎల్ నినో ప్రభావంతో రాయలసీమ, ఉత్తరాంధ్రలో కరువు చాయలు ఇప్పటికే అలుముకున్నాయని ప్రభుత్వం చెబుతుంది.

**సాగర్ ఆయకట్టు కింద...**

ఇక తెలంగాణలోనూ వానలు ఏపీతో పోల్చుకుంటే కొద్దిగా పరవాలేదు. జూరాల ప్రాజెక్టుకు నీరు చేరింది. గోదావరి నదికి వరద నీరు రావడంతో కొంత ఆయకట్టు కింద ఉన్న రైతులకు సాగు నీరు అందే అవకాశముంది. కాళేశ్వరం, మేడిగడ్డ, శ్రీరామ్ సాగర్ తో పాటు జూరాల ప్రాజెక్టులో నీరు ఉన్నప్పటికీ ఇంకా నీరు సాగుకు విడుదల చేయలేదు. ఇక నాగార్జున సాగర్ కు అయితే నీరు ఇంకా చేరక దాని ఆయకట్టు రైతులు వ్యవసాయపరంగా ఇబ్బందులు పడుతున్నారు. అందుకే ప్రభుత్వం సాగర్ జలాశయం వద్ద ఈ నెల 10న వరుణయాగాన్ని కూడా చేపట్టింది. అంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. వానలు కురుస్తున్నాయే తప్ప అది సాగుకు ఉపయోగం లేని వానలని అధికారులు చెబుతున్నారు. రైతులు మాత్రం కొంత భూగర్భ జలాలు నిండటంతో ఖరీఫ్ సాగును ప్రారంభించారు

## పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి కేసీఆర్ పరామర్శ.. రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం అందజేత

- మొదటి పేజి తరువాయి

అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీ ప్రకటించిన రూ.2.25 కోట్ల ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కులను కేసీఆర్ స్వయంగా సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులకు అందజేశారు. నల్లబెల్లిలోని నివాసానికి చేరుకున్న కేసీఆర్, తొలుత సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడారు. సుదర్శన్‌రెడ్డితో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని కేసీఆర్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. సుదర్శన్‌రెడ్డి అత్యంత సాదాసీదా జీవితం గడిపారని, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మంచి నేత అని కొనియాడారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున ప్రకటించిన ఆర్థిక సాయంలో భాగంగా సుదర్శన్‌రెడ్డి ఇద్దరు పిల్లల పేరున చెరో రూ.1 కోటి, ఆయన తల్లి అమృతమ్మ సంరక్షణ కోసం రూ.25 లక్షల చెక్కులను కేసీఆర్ అందించారు. పిల్లల చదువులు, భవిష్యత్తుతో పాటు కుటుంబ సంక్షేమ బాధ్యతలను పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తుందని స్పష్టం చేశారు. కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. కేసీఆర్ రాక సందర్భంగా నల్లబెల్లికి బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులు, అభిమానులు భారీగా తరలివచ్చారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి నివాసం వద్ద జనం కిక్కిరిసిపోవడంతో స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి, పరిస్థితిని అదుపులోకి తెచ్చి కేసీఆర్ కాన్వాయ్‌కు దారి కల్పించారు. కేసీఆర్ వెంట పలువురు పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

## బ్రహ్మోస్‌కు ప్రపంచవ్యాప్తంగా పెరిగిన గిరాకీ.. కొనుగోలుకు క్యూ కడుతున్న దేశాలు!

- మొదటి పేజి తరువాయి

ఇప్పటికే కొన్ని దేశాలతో భారీ ఒప్పందాలు కూడా ఖరారయ్యాయి. 'ది వీక్' పత్రిక ప్రచురించిన ఒక నివేదిక ప్రకారం, ఈ క్షిపణి కొనుగోలుకు చర్చలు వేగవంతమయ్యాయి. 2022 జనవరిలో ఫిలిప్పీన్స్‌తో 375 మిలియన్ డాలర్ల ఒప్పందం కుదుర్చుకున్న భారత్, ఆపరేషన్ సిందూర్ తర్వాత మరిన్ని విజయాలు సాధించింది. వియత్నాం సుమారు 629 మిలియన్ డాలర్ల ఒప్పందాన్ని ఖరారు చేయగా, ఇండోనేషియా కూడా 200 నుంచి 300 మిలియన్ డాలర్ల మధ్య విలువైన ఒప్పందాన్ని ఖరారు చేసుకుంది. యూరప్, పశ్చిమాసియా, లాటిన్ అమెరికా, ఆఫ్రికాకు చెందిన డజనుకు పైగా దేశాలు కూడా బ్రహ్మోస్ కొనుగోలుపై ఆసక్తి వ్యక్తం చేస్తున్నాయి.

**ఆపరేషన్ సిందూర్‌తో పెరిగిన ప్రతిష్ఠ**

పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే), పాకిస్థాన్‌లోని కీలక ఉగ్ర స్థావరాలపై భారత సైన్యం 'ఆపరేషన్ సిందూర్' నిర్వహించింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా, భారత వాయుసేన విమానాలు అంతర్జాతీయ సరిహద్దు దాటకుండానే సుమారు 15 బ్రహ్మోస్ క్షిపణులను పాక్ సైనిక స్థావరాలపై ప్రయోగించాయి. ఈ దాడుల కచ్చితత్వం, తీవ్రత పాకిస్థాన్‌ను తీవ్రంగా దెబ్బతీశాయి. ముఖ్యంగా, పాకిస్థాన్ మోహరించిన చైనా నిర్మిత ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను బ్రహ్మోస్ విజయవంతంగా ఛేదించడం ఒక కీలక పరిణామం. ఈ క్షిపణి దాడుల ధాటికి తట్టుకోలేకే పాకిస్థాన్ వెంటనే కాల్పుల విరమణకు పిలుపునిచ్చిందని నివేదికలు పేర్కొంటున్నాయి. ఈ పరిణామమే బ్రహ్మోస్‌పై ప్రపంచ దేశాలకు నమ్మకాన్ని పెంచింది.

**పెరిగిన ఉత్పత్తి.. భవిష్యత్ ప్రణాళికలు**

పెరుగుతున్న దేశీయ, అంతర్జాతీయ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని భారత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని గణనీయంగా పెంచింది. హైదరాబాద్, నాగ్‌పూర్, పిలానీలతో పాటు ఇటీవల లక్నోలో కొత్తగా ప్రారంభించిన ప్లాంట్‌లో కూడా ఉత్పత్తి మొదలైంది. ప్రస్తుతం ఈ నాలుగు కేంద్రాల్లో నెలకు కనీసం నాలుగు క్షిపణులను తయారు చేసే సామర్థ్యం ఉండగా, దీనిని మరింత విస్తరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. భారత నావికాదళంలోని ప్రతి ప్రధాన యుద్ధనౌక, వాయుసేనలోని ప్రతి ఫైటర్ జెట్‌ను బ్రహ్మోస్‌తో సన్నద్ధం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

**బ్రహ్మోస్ ప్రస్థానం**

బ్రహ్మోస్ ప్రాజెక్టుకు 1997లో అంకురార్పణ జరిగింది. అప్పటి డీఆర్‌డీఓ చీఫ్ ఏపీజే అబ్దుల్ కలాం నేతృత్వంలోని ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిస్సైల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భూమికి సమీపంగా ప్రయాణించే క్రూయిజ్ క్షిపణి లోటును గుర్తించారు. ఈ క్రమంలోనే రష్యాతో కలిసి బ్రహ్మోస్ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. డీఆర్‌డీఓ, రష్యాకు చెందిన ఎన్‌పీఓ మషినోస్ట్రోయేనియా (చీూ మీఛింస్త్రఱఅశీర్‌తీశీఎవఅఱఎు) సంయుక్త భాగస్వామ్యంతో 'బ్రహ్మోస్ ఏరోస్పేస్' ఏర్పడింది. తొలినాళ్లలో 'పీజే-10' అనే కోడ్‌నేమ్‌తో అత్యంత రహస్యంగా ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేశారు. మరోవైపు, బ్రహ్మోస్‌లో కొత్త వేరియంట్ల అభివృద్ధిపై కూడా శాస్త్రవేత్తలు దృష్టి సారించారు. నీటి అడుగున ప్రయోగించే సామర్థ్యమున్న వెర్షన్, తేలికైన మినీ వేరియంట్‌ను రూపొందించే పనులు కొనసాగుతున్నాయి. భవిష్యత్తులో పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో బ్రహ్మోస్‌ను తయారు చేసి, తేజస్, ఎల్‌సీఏ ఎంకే 2 వంటి దేశీయ యుద్ధ విమానాలకు అనుసంధానించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇది రక్షణ రంగంలో స్వావలంబన సాధించే దిశగా భారత్ చేస్తున్న ప్రయత్నాలకు మరింత బలాన్ని చేకూర్చనుంది.

# కన్నుల పండువగా లాల్‌దర్వాజా బోనాలు

- మొదటి పేజి తరువాయి

స్పష్టం చేశారు. బోనాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేశారని మంత్రి పేర్కొన్నారు. చివరి భక్తుడికి కూడా అమ్మవారి దర్శనం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ హైదరాబాద్ బోనాల నిర్వహణకు ప్రభుత్వం రూ.20 కోట్లు కేటాయించిందన్నారు. రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో పటిష్ఠమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలు, రైతులు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు చెప్పారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్. నంద్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా అమ్మవారికి బంగారు బోనం సమర్పించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, పోలీస్ కమిషనర్ సజ్జనార్, డీసీపీలు, ఆర్డీవో రామకృష్ణ, వివిధ శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# నల్సార్ స్నాతకోత్సవానికి సీజేఐ వద్దు.. విద్యార్థుల నిరసన!

- మొదటి పేజి తరువాయి

వ్యతిరేకిస్తూ విద్యార్థులు నిరసన గళం విప్పారు. ఈ మేరకు దాదాపు 450 మంది విద్యార్థులు సంతకాలు చేసి విశ్వవిద్యాలయ యాజమాన్యానికి ఒక లేఖ రాశారు. ఈ పరిణామం తెలంగాణ న్యాయ విద్యా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే, 2026 బ్యాచ్ స్నాతకోత్సవానికి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించే ప్రతిపాదనను విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఢిల్లీలో జరిగిన నీట్ నిరసనలపై సుప్రీంకోర్టులో జూలై 22న జరిగిన విచారణ సందర్భంగా సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం చేసిన వ్యాఖ్యలే ఈ నిరసనకు ప్రధాన కారణం. ఆ రోజు విచారణ సందర్భంగా, నిరసనకారులపై పోలీసుల చర్యకు సంబంధించిన వీడియోలపై సుమోటో విచారణ చేపట్టడానికి ధర్మాసనం నిరాకరించింది. ఈ క్రమంలో సీజేఐ, "వీడియోలు చూసే ఆసక్తి మాకు లేదు," "మా సమయాన్ని, మీ సమయాన్ని వృథా చేయకండి" వంటి వ్యాఖ్యలు చేశారని విద్యార్థులు తమ లేఖలో పేర్కొన్నారు. సీజేఐ వ్యాఖ్యలు అసంబద్ధంగా, బాధ్యతారహితంగా ఉన్నాయని, అందుకే ఆయనను స్నాతకోత్సవానికి పిలవరాదని వారు డిమాండ్ చేస్తున్నారు. తమ డిమాండ్‌కు మద్దతుగా విద్యార్థులు ఇప్పటికే ఒక పూట భోజనం చేయకుండా నిరసన తెలిపారు. తమ అభ్యర్థనను యాజమాన్యం పట్టించుకోకపోతే, వారం రోజుల నోటీసు ఇచ్చి ఆందోళనలు మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. అయితే, నల్సార్ యాజమాన్యం స్నాతకోత్సవం తేదీని గానీ, ముఖ్య అతిథిని గానీ అధికారికంగా ఇంకా ప్రకటించలేదు. కానీ, ప్రతి ఏటా సీజేఐని స్నాతకోత్సవానికి ఆహ్వానించడం నల్సార్‌లో ఒక సంప్రదాయంగా వస్తోంది.

కాగా,

సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ విద్యార్థుల నిరసనను ఎదుర్కోవడం ఇది రెండోసారి. ఈ నెల మొదట్లో ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (౧×ూా)లో జరగాల్సిన 86వ స్నాతకోత్సవానికి కూడా ఆయనే ముఖ్య అతిథిగా హాజరు కావాల్సి ఉంది. అయితే, ఎస్ఎఫ్ఐ అనుబంధ విద్యార్థులు నిరసన తెలిపే అవకాశం ఉందన్న ఇంటెలిజెన్స్ సమాచారంతో ఆ కార్యక్రమాన్ని చివరి నిమిషంలో వాయిదా వేశారు. ఇప్పుడు టిస్ తర్వాత నల్సార్‌లోనూ అదే పరిస్థితి పునరావృతం కావడం గమనార్హం. విద్యార్థుల లేఖతో నల్సార్ యాజమాన్యం ఇప్పుడు ఇరకాటంలో పడింది.

# బోనాలకు నిధులెందుకు తగ్గించారు?..

- మొదటి పేజి తరువాయి

చరిత్రను వాస్తవ కోణంలో బోధించాలి..

తెలంగాణ సాయుధ పోరాట యోధుల చరిత్రను పాఠ్యాంశాల్లో ఎందుకు చేర్చలేదని బండి సంజయ్ ప్రశ్నించారు. చరిత్రను వాస్తవ కోణంలో భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. టిప్పుసుల్తాన్ అంశాన్ని ప్రస్తావిస్తూ కాంగ్రెస్ వైఖరి పై విమర్శలు చేశారు. అయోధ్య రామమందిర నిర్మాణాన్ని కాంగ్రెస్ నేతలు వ్యతిరేకించడం పై కూడా ఆయన ప్రశ్నలు సంధించారు. హిందూ సమాజానికి సంబంధించిన సమస్యలను ప్రశ్నిస్తే వాటికి మతం రంగు పులమడం సరికాదని అన్నారు. ఆలయాల పరిరక్షణ, గోరక్షణ, హిందువుల భద్రత వంటి అంశాలపై తాను నిరంతరం మాట్లాడుతూనే ఉంటానని స్పష్టం చేశారు. సనాతన ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**'బోనాలకు ఎన్నికలకు సంబంధం లేదు'..**

తాను ప్రతి ఏడాది బోనాల ఉత్సవాల్లో పాల్గొంటున్నానని, బోనాలకు ఎన్నికలకు ఎలాంటి సంబంధం లేదని బండి సంజయ్ పేర్కొన్నారు. బీజేపీ స్వచ్ఛంద సంస్థ కాదని, ప్రజా సమస్యలపై పోరాడే రాజకీయ పార్టీ అని అన్నారు. హిందూ సమాజం మరింత చైతన్యవంతం కావాల్సిన అవసరం ఉందన్నారు.

నిరుద్యోగం, ఉద్యోగాలపై ప్రభుత్వాన్ని నిలదీత..

రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని బండి సంజయ్ ఆరోపించారు. హైడ్రాలో కేవలం 150 పోస్టుల భర్తీకి నిర్వహించిన ఫిజికల్ టెస్ట్‌కు సరూర్‌నగర్ స్టేడియం యువతతో నిండిపోవడం పరిస్థితికి అద్దం పడుతోందన్నారు. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ఉద్యోగాలు భర్తీ చేసే వరకు నిరుద్యోగులకు నెలకు రూ.4 వేల భృతి ఇస్తామన్న హామీని కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రోజ్‌గార్ మేళాల ద్వారా పెద్ద సంఖ్యలో ఉద్యోగ నియామకాలు చేపట్టిందని పేర్కొన్నారు.

**ఫీజు రీయింబర్స్‌మెంట్ పై ఆందోళన..**

ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని బండి సంజయ్ అన్నారు. ఫీజులు చెల్లించలేక విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే బకాయిలను విడుదల చేసి పేద విద్యార్థులకు అండగా నిలవాలని కోరారు.

**ఎన్నికల హామీల అమలు పై ప్రశ్నలు..**

మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ.2,500 చెల్లిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని బండి సంజయ్ ప్రశ్నించారు. వృద్ధాప్య పింఛన్లను రూ.4 వేలకు పెంచుతామని హామీ ఇచ్చి ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. అర్హులైన వృద్ధుల నుంచి పింఛన్ దరఖాస్తులు ఎందుకు స్వీకరించడం లేదని ప్రశ్నించారు. అభివృద్ధి, ఉద్యోగాలు, సంక్షేమ పథకాల అమలుపై ప్రశ్నిస్తే వాటికి మతం రంగు పులమడం సరికాదని బండి సంజయ్ అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు అన్ని వర్గాల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఆయన డిమాండ్ చేశారు.

# మావోయిజం ఖతం అనుకునేలోపే.. మరో భూతం రాష్ట్రాన్ని చుట్టేస్తోంది

- మొదటి పేజి తరువాయి

పరిస్థితిపై డీజీపీ మాట్లాడుతూ, గత 30 ఏళ్లుగా మావోయిస్టుల అదుపుపైనే దృష్టి సారించిన పోలీసు యంత్రాంగం, ఇప్పుడు కొత్త సవాళ్లను ఎదుర్కొనే దిశగా అడుగులు వేస్తోందని తెలిపారు. "ప్రస్తుతం రాష్ట్రం ముందున్న అతిపెద్ద సవాలు మాదకద్రవ్యాల (డ్రగ్స్) వినియోగం, అక్రమ రవాణా. యువతను, విద్యార్థులను పట్టి పీడిస్తున్న డ్రగ్స్ భూతాన్ని కూకటివేళ్లతో పెకిలించేందుకు ప్రత్యేక వ్యూహాలను అమలు చేస్తున్నాం," అని ఆయన పేర్కొన్నారు.

**రాజకీయ నేతల భద్రతపై స్పష్టత..**

కొందరు రాజకీయ నాయకులు తమ గన్ మెన్‌లను తగ్గించారని పదే పదే ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో డీజీపీ కీలక వివరణ ఇచ్చారు. మావోయిస్టుల ప్రాబల్యం తగ్గడంతో, దేశంలోని ఇతర రాష్ట్రాల మాదిరిగానే తెలంగాణలోనూ ప్రజాప్రతినిధుల భద్రతను సమీక్షించి తగ్గించాం. భద్రతను పూర్తిగా తొలగించలేదు. కేవలం ముప్పు (ఒష్ట్రతీమశ్‌ూవతీఎవజ్‌అశీఅ) స్థాయిని బట్టి అవసరమైన మేరకు మాత్రమే తగ్గించాం. నిఘా వర్గాల నివేదికలు, సెక్యూరిటీ కమిటీ సూచనల ఆధారంగానే ఈ నిర్ణయం తీసుకున్నామనీ, ఇందులో రాజకీయ కోణం ఏమీ లేదని స్పష్టం చేశారు. పోలీస్ శాఖలో భారీ సంస్కరణలు భవిష్యత్తు అవసరాల దృష్ట్యా పోలీస్ వ్యవస్థను మరింత పటిష్టం చేస్తున్నట్లు డీజీపీ తెలిపారు. మావోయిస్టుల ఏరివేతలో కీలక పాత్ర పోషించిన గ్రేహౌండ్స్, ఎస్ఐబీ వంటి బలగాల సేవలను ఇకపై సైబర్ నేరాలు, డ్రగ్స్ నియంత్రణ, మరియు ఆహార కల్తీ ముఠాల పట్టుకోసం వినియోగించనున్నారు. త్వరలోనే కొత్త 'తెలంగాణ పోలీస్ మాన్యువల్ ను తీసుకురాబోతున్నామని, శాంతి భద్రతలతో పాటు ట్రాఫిక్ నిర్వహణ, ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని డీజీపీ వివరించారు.

# మమతా బెనర్జీ కారుపై దాడి

- మొదటి పేజి తరువాయి

చేతుల్లోకి వెళ్లిపోయిందని మండిపడ్డారు. బిర్జూ అనే టీఎంసీ కార్యకర్తను ఇటీవల పోలీసులు అరెస్టు చేశారు. పోలీసు కస్టడీలో ఉన్న సమయంలోనే మృతి చెందాడు. తన భర్తను లాకప్‌లో కొట్టడం వల్లే ప్రాణాలు కోల్పోయాడని ఆయన భార్య ఆరోపించారు. ఈ క్రమంలోనే బిర్జూ కుటుంబాన్ని పరామర్శించేందుకు మమత బయల్దేరారు. ఆమె వెంట ఎంపీలు కల్యాణ్ బెనర్జీ, దోలా సేన్ ఉన్నారు. మార్గమధ్యంలో నిరసనకారులు ఆమె వాహనాన్ని లక్ష్యంగా చేసుకున్నారు. ఈ వ్యవహారం అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది.

**పిల్లల భవిష్యత్తు కంటే మంత్రి పదవి ముఖ్యమేం కాదు: ధర్మేంద్ర ప్రధాన్**

"నా కారుపై చెప్పులు, బురద విసిరారు. రాళ్లు, ఇటుకలతో దాడి చేశారు. నా తల పగిలిపోయి ఉండేది. ఇది ముమ్మాటికీ కుట్రే. నేను వస్తున్నానని పోలీసులకు ముందే చెప్పాను. అయినప్పటికీ ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోలేదు. నన్ను లక్ష్యంగా చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం గూండాలను వాడుకుంటోంది" అని మమత ఆరోపించారు. అయితే, ఉద్రిక్తతలను రెచ్చగొట్టేందుకే మమత అక్కడికి వెళ్లారని భాజపా ఆరోపించింది. ఆమె రాకపై స్థానికులు నిరసన తెలిపారని పేర్కొంది.

## ఇజ్రాయెల్‌లో మిలిటరీ సెలవులు రద్దు... ఇరాన్‌పై దాడుల కోసమేనా.?

- మొదటి పేజి తరువాయి

దీంతో ఇజ్రాయెల్ మళ్లీ ఇరాన్‌పై కొత్త దాడులు ప్రారంభించనుందా అనే అనుమానం వ్యక్తమవుతోంది. ఇరాన్‌పై మొదటిసారి దాడులు చేపట్టడానికి కొన్ని గంటల ముందు కూడా ఆ దేశం సైనికులకు ఇటువంటి ప్రకటనే చేసింది. దీంతో ఇప్పుడు కూడా పెద్ద స్థాయిలో దాడులు చేపట్టడానికి ఆ దేశ సైన్యం సిద్ధమయ్యే అవకాశం ఉందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. యుద్ధం కారణంగా గగనతల రక్షణ వ్యవస్థల కొరత ఏర్పడుతుండడంతో దాడులను ఆపివేయాలని అమెరికా భావిస్తోంది. అయితే నెతన్యాహు (చీమ్ఖుఅఖుష్ట్రబ) మాత్రం యుద్ధం కొనసాగించడానికే మొగ్గు చూపుతున్నారని స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి. అమెరికా సాయం లేకుండా సొంతంగా టెహ్రాన్‌పై విరుచుకుపడడానికి (ఔతీఅవెం ూఅ ×తీుఅ) సైన్యం సన్నాహాలు కూడా ప్రారంభించినట్లు తెలిపాయి. ఇరాన్‌లోని కీలక నేతలు, ఐఆర్‌జీసీ అధికారులే లక్ష్యంగా దాడులు చేయడానికి ఇప్పటికే నెతన్యాహు సైనికాధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది.

ట్రంప్ శాంతి ప్రణాళికలను వ్యతిరేకించిన నెతన్యాహు..

ఇరాన్‌తో యుద్ధం ముగింపు, గాజాలో దాడుల నిలుపుదల కోసం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ (ఖశీఖుశ్రీం ఎతీబఎజూ) ప్రతిపాదించిన 15 పాయింట్ల ప్రణాళికను నెతన్యాహు వ్యతిరేకించారు. గాజా విషయంలో అగ్రరాజ్య ప్రతిపాదనలను అంగీకరించబోమని.. హమాస్ పూర్తిగా ఆయుధాలు విడిచిపెట్టేంతవరకు వెనక్కి తగ్గబోమని ప్రకటించారు.

**దాడులు చేస్తే.. ప్రతీకారం తీర్చుకుంటాం: ఇరాన్**

ఇజ్రాయెల్ మరోసారి తమపై దాడి చేస్తే.. తీవ్ర స్థాయిలో విరుచుకుపడతామని ఇరాన్ శనివారం హెచ్చరించింది. టెల్ అవీవ్‌లోని చమురు రిఫైనరీలు, కీలక కార్యాలయాలను లక్ష్యం చేసుకుంటామని పేర్కొంది. వ్యూహాత్మక హర్మూజ్ ప్రాంతం నుంచి సైన్యాన్ని ఉపసంహరించుకోవాలని అమెరికాకు సూచించింది. ఇరాన్‌పై యుద్ధాన్ని శాశ్వతంగా ముగించాలని.. దాడుల కారణంగా జరిగిన నష్టానికి పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించాలని డిమాండ్ చేసింది.

## రష్యా నుంచి భారత్‌కు రైలు మార్గం.. సరికొత్త కారిడార్‌పై భారీ ప్లాన్!

- మొదటి పేజి తరువాయి

మరాత్ ఖుస్నుల్లిన్ స్వయంగా వెల్లడించారు. రష్యా వార్తా సంస్థ 'టాస్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ కీలక విషయాలను తెలిపారు.

కీలకమైన సముద్ర మార్గాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాల్సిన అవసరం ఉందని ఖుస్నుల్లిన్ ఈ సందర్భంగా నొక్కిచెప్పారు. ముఖ్యంగా, బోస్ఫరస్ జలసంధి, హర్మూజ్ జలసంధి వంటి అంతర్జాతీయ వాణిజ్యానికి అత్యంత కీలకమైన మార్గాలలో ఎదురయ్యే సవాళ్లను దృష్టిలో ఉంచుకుని, వాటికి ప్రత్యామ్నాయంగా భూమార్గ రవాణా కారిడార్లను అభివృద్ధి చేయాలని రష్యా భావిస్తున్నట్లు ఆయన వివరించారు. ప్రపంచ చమురు వాణిజ్యంలో దాదాపు 25 శాతం, ఎల్ఎన్‌జీ రవాణాలో 20 శాతం హర్మూజ్ జలసంధి నుంచే జరుగుతుంది. ఈ మార్గాల్లో ఉండే ఉద్రిక్తతలు, ఇబ్బందులు తమ దేశ రవాణా వ్యవస్థపై ప్రభావం చూపకూడదనేది రష్యా వ్యూహంగా కనిపిస్తోంది. ఈ ప్రణాళికలో భాగంగా, రష్యా నుంచి బయలుదేరి తుర్క్‌మెనిస్థాన్, ఇరాన్, ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ మీదుగా భారత్‌కు చేరుకునేలా ఒక రైల్వే కారిడార్‌ను నిర్మించడం ఒక ఆచరణీయమైన మార్గంగా ఖుస్నుల్లిన్ పేర్కొన్నారు. అయితే, భారత్‌కు చేరువయ్యేందుకు ఏ మార్గమైనా తాము పరిశీలించడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈ ప్రతిపాదన కేవలం ప్రాథమిక అన్వేషణ దశలోనే ఉంది. రైల్వే మార్గం, ప్రయాణికుల రైలు సర్వీసులు, టికెట్ ధరలు లేదా ప్రాజెక్టు ప్రారంభ తేదీ వంటి వివరాలేవీ ఇంకా ఖరారు కాలేదని ఆయన తెలిపారు. ఈ రైల్వే కారిడార్ వాస్తవరూపం దాల్చితే రష్యాకు, భారత్‌కు ఇరు దేశాలకూ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. సముద్ర మార్గాలపై పూర్తిగా ఆధారపడకుండా, హిందూ మహాసముద్రం వైపు తమ సరుకులను రవాణా చేయడానికి రష్యాకు ఇది మరో ముఖ్యమైన మార్గాన్ని అందిస్తుంది. అదే సమయంలో, మధ్య, దక్షిణాసియాతో రష్యాకు భూమార్గ కనెక్టివిటీ మరింత బలోపేతం అవుతుంది. భారత్‌కు కూడా ఈ కారిడార్ ద్వారా రష్యా, మధ్య ఆసియా దేశాలతో వాణిజ్య, రవాణా సంబంధాలు మెరుగుపడతాయి. ప్రజల రాకపోకలు పెరిగి పర్యాటక రంగం కూడా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది. అయితే, ఈ ప్రతిపాదన ఆచరణలోకి రావడం అంత సులభం కాదు. ఈ మార్గం పలు దేశాల గుండా వెళ్లాల్సి ఉండటం, భారీగా మౌలిక సదుపాయాలు కల్పించాల్సి రావడం వంటి సవాళ్లు ఉన్నాయి. ముఖ్యంగా, రవాణా, భద్రత, సరిహద్దుల వద్ద సమన్వయం వంటి అనేక క్లిష్టమైన అంశాలు ఈ ప్రాజెక్టుతో ముడిపడి ఉన్నాయి. అయినప్పటికీ, ఇన్ని సవాళ్లు ఉన్నా, భారత్‌తో నేరుగా భూమార్గం ద్వారా కనెక్ట్ కావాలన్న రష్యా ఆలోచన వ్యూహాత్మకంగా ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది.



దుండిగల్ మండలం దొమ్మర పోచంపల్లి బంగారు పోచమ్మ అమ్మవారి స్వరూపం..

- దుండిగల్ మండలం డి.పోచంపల్లిలో వైభవోపేతంగా బోనాల పండుగ..
- సంస్కృతి సంప్రదాయ దుస్తుల్లో బోనమెత్తిన మహిళలు..
- డప్పుచప్పుళ్లు, శివసత్తుల నృత్యాలతో సందడిగా మారిన వేడుకలు..
- సుంకరి కృష్ణ, బండారి మహేందర్ యాదవ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు..
- అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన నాయకులు..
- గ్రామస్తులకు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని వేడుకున్న నేతలు..

# పెన్ పవర్
## తెలంగాణ రౌండప్



దొమ్మర పోచంపల్లి గ్రామంలో బోనమెత్తిన మహిళలు..



బీఆర్ఎస్ నేత మాజీ కౌన్సిలర్ సుంకరి కృష్ణ..



బీఆర్ఎస్ నేత మాజీ కౌన్సిలర్ బండారి మహేందర్ యాదవ్..

## శ్రీ శ్రీ శ్రీ బంగారు పోచమ్మ తల్లి సన్నిధిలో
# భక్తి పారవశ్యం

- దుండిగల్ దొమ్మర పోచంపల్లిలో ఘనంగా బోనాల వేడుకలు..
- భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించిన మహిళలు..

గ్రామదేవతగా కొలిచే బంగారు పోచమ్మ తల్లి కరుణాకటాక్షాలు తమ గ్రామంపై ఎల్లవేళలా ఉండాలని కోరుతూ దొమ్మర పోచంపల్లి ప్రజలు భక్తిశ్రద్ధలతో బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకోవడంతో ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో కిటకిటలాడింది..ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ, డోలు చప్పుళ్ళు మార్మోగాయి.. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో బోనాలు ఎత్తుకుని, డప్పుచప్పుళ్లు, శివసత్తుల నృత్యాల మధ్య, గ్రామపెద్దలతో కలిసి అమ్మవారి సన్నిధికి చేరుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది..

సిఎంసి బ్యూరో, పెన్ పవర్, ఆగష్టు 9:

-4లో

01

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
'ఐదు రోజులకు'
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# బోనాల వేడుకల్లో భరత్ సింహారెడ్డి సందడి..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో పలుచోట్ల ఫలహారం బండి ఊరేగింపులు..



-5లో

- పలువురి ఆహ్వానం మేరకు పాల్గొన్న భరత్ అమ్మవారికి ప్రత్యేక పూజలు..
- జీడిమెట్ల, కుత్బుల్లాపూర్‌లో ఘనంగా ఫలహారం బండి ఊరేగింపు..
- యువ ఫౌండేషన్, టీం కుత్బుల్లాపూర్ సిండికేట్ ఆధ్వర్యంలో వేడుకలు..
- అంబేద్కర్ నగర్‌లో దిలీప్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం..
- చంద్రానగర్‌లో హిందూవాహిని ఆధ్వర్యాన ఊరేగింపులో పాల్గొన్న భరత్ సింహారెడ్డి..
- రంగారెడ్డి నగర్‌లో కిరణ్ ఆధ్వర్యంలో ఫలహారం బండి..
- అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన భరత్ సింహారెడ్డి..

# యాదాద్రి భువనగిరి జిల్లాలో రూ.54 కోట్లు విలువైన డ్రగ్స్ స్వాధీనం



ప్రతీకాత్మక చిత్రం

**హైదరాబాద్ పెన్ పవర్:** యాదాద్రి భువనగిరి జిల్లాలో భారీగా డ్రగ్స్‌ను పోలీసులు పట్టుకున్నారు. బీబీనగర్ మండలం కొండమడుగు వద్ద ముఠా నుంచి రూ.54 కోట్లు విలువచేసే 27 కిలోల మెఫిడ్రిన్, 40 కిలోల అసిటోన్ లిక్విడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ ముఠాలో ఉన్న నలుగురిని అరెస్ట్ చేయగా.. పరారీలో ఉన్న మరికొందరి కోసం పోలీసులు గాలింపు కొనసాగిస్తున్నారు. అరెస్టయిన వారిలో చేతన్ ముధుకర్, ముజామిల్ హక్, అశోక్ గవాండే, రమణమూర్తి ఉన్నారు. ఎండీ అయూబ్, ప్రదీప్ ఠాకూర్, గోపాల్ సిర్పట్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కొండమడుగులోని వేటుకూరి ల్యాబ్స్‌లో అక్రమంగా మెఫిడ్రిన్ తయారు చేసి అక్కడి నుంచి నాగపూర్ తరలిస్తున్నట్లు గుర్తించారు.


అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ..




గ్రామ యూత్‌తో బీఆర్ఎస్ నేతలు..

# శ్రీ శ్రీ శ్రీ బంగారు పోచమ్మతల్లి సన్నిధిలో భక్తి పారవశ్యం


డి.పోచంపల్లిలో అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న మహేందర్ యాదవ్..

- 3 పేజి తరువాయి
దుండిగల్ సర్కిల్ సిఎంసీ పరిధిలోని దొమ్మర పోచంపల్లి గ్రామంలో బోనాల పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గాయత్రి నగర్, వివేకానంద నగర్, ఇందిరా నగర్ కాలనీలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ శ్రీ శ్రీ బంగారు పోచమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించారు.. ఆలయ ఉత్సవ నిర్వాహకులు పెంబర్ల బుచ్చయ్య ఆధ్వర్యంలో బంగారు పోచమ్మ తల్లి ఆలయాన్ని, అమ్మవారిని విద్యుత్ దీపాలు, రంగురంగుల పూలతో సుందరంగా అలంకరించారు.. మాజీ కౌన్సిలర్ బండారి మహేందర్ యాదవ్ సహాయ సహకారాలతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ సీనియర్ నేతలు, మాజీ కౌన్సిలర్లు సుంకరి కృష్ణ, బండారి మహేందర్ యాదవ్ హాజరై బంగారు పోచమ్మ తల్లికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు..


గ్రామం నుండి బోనాలు ఎత్తుకుని బయలుదేరిన మహిళలు.. శివసత్తుల నృత్యం..


సూరారం శ్రీరాంనగర్ కాలనీలోని శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లికి బోనమెత్తిన, చిన్నారి నలిటి జోష్విక..

## డప్పుచప్పుళ్లు.. శివసత్తుల నృత్యాలు నడుమ బోనాల సమర్పణ..

దొమ్మర పోచంపల్లి గ్రామంలో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా బోనాల వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు.. స్థానిక మహిళలు సంప్రదాయ పద్ధతిలో పట్టు వస్త్రాలు ధరించి, బోనాలు ఎత్తుకుని డప్పుచప్పుళ్లు, శివసత్తుల నృత్యాల నడుమ ఆలయానికి చేరుకున్నారు. అనంతరం భక్తిశ్రద్ధలతో బంగారు పోచమ్మ తల్లికి బోనాలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాతే, బోనాల పండుగకు ఒక ప్రత్యేక గుర్తింపు లభించిందని తెలిపారు. బంగారు పోచమ్మతల్లి గ్రామస్తులను ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో చల్లగా చూడాలని అమ్మవారిని కోరుకున్నట్లు సుంకరి కృష్ణ, బండారి మహేందర్ యాదవ్ తెలిపారు.. అనంతరం ముఖ్య అతిథులను ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించారు.. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్ సాయి యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొల్తూరు మల్లేశ్ ముదిరాజ్, స్వామి రెడ్డి, కిరణ్ కుమార్, రాజాక్, భూపతిరావు, కుసుమ (పులి)రావు, శివ యాదవ్, శేఖర్ గౌడ్, రాజిరెడ్డి, సాంబరాజు, జింకల భాస్కర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు..



తెలంగాణలో గ్రామదేవతగా పోచమ్మ తల్లిని భక్తులు ఎంతో విశ్వాసంతో కొలుస్తారు. గ్రామ ప్రజలను కాపాడే తల్లిగా, ఆయురారోగ్యాలు, పాడిపంటలు, సుఖసంతోషాలు ప్రసాదించే దేవతగా అమ్మవారిని ఆరాధించే సంప్రదాయం తరతరాలుగా కొనసాగుతోంది. బోనాల సందర్భంగా అమ్మవారికి నైవేద్యం సమర్పించి, తమ కుటుంబాలు, గ్రామం సుభిక్షంగా ఉండాలని భక్తులు మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ. దొమ్మర పోచంపల్లిలోని శ్రీ శ్రీ శ్రీ బంగారు పోచమ్మ తల్లి సన్నిధిలోనూ ఇదే భక్తి సంప్రదాయం ఘనంగా కొనసాగింది..



మహేందర్ యాదవ్ కుటుంబ సభ్యులతో..



మాజీ కౌన్సిలర్ మహేందర్ యాదవ్‌తో బంధువుల కూతుర్లు..





- పలువురి ఆహ్వానం మేరకు పాల్గొన్న భరత్ అమ్మవారికి ప్రత్యేక పూజలు..
- జీడిమెట్ల, కుత్బుల్లాపూర్‌లో ఘనంగా ఫలహారం బండి ఊరేగింపు..
- యువ ఫౌండేషన్, టీం కుత్బుల్లాపూర్ సిండికేట్ ఆధ్వర్యంలో వేడుకలు..
- అంబేద్కర్ నగర్‌లో దిలీప్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం..
- చంద్రానగర్‌లో హిందూవాహిని ఆధ్వర్యాన ఊరేగింపులో పాల్గొన్న భరత్ సింహారెడ్డి..
- రంగారెడ్డి నగర్‌లో కిరణ్ ఆధ్వర్యంలో ఫలహారం బండి..
- అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన భరత్ సింహారెడ్డి..

# బోనాల వేడుకల్లో భరత్ సింహారెడ్డి సందడి



## కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో పలుచోట్ల ఫలహారం బండి ఊరేగింపులు..

### అంతటా ఆధ్యాత్మికత పెంపొందుతున్న వైనం..

బోనాల పండుగను పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారని భరత్ సింహారెడ్డి తెలిపారు.. అదేవిధంగా చింతల్ డివిజన్ పరిధిలోని చంద్రానగర్‌లో హిందూవాహిని, ఉప్పల సంతోష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహారం బండి ఊరేగింపులో భరత్ సింహారెడ్డి పాల్గొన్నారు.. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులతో కలిసి పండుగ వేడుకల్లో పాల్గొన్నారు.. అనంతరం రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని రంగారెడ్డి నగర్‌లో కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్న భరత్ అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన ఫలహారం బండి ఊరేగింపులు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. మహిళలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఊరేగింపులతో ఆయా ప్రాంతాల్లో పండుగ వాతావరణం నెలకొంది. బోనాల పండుగ సందర్భంగా ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భరత్ సింహారెడ్డి ఆకాంక్షించారు.

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, ఆగష్టు 9:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో బోనాల పండుగ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి. బోనాల పండుగ సందర్భంగా వివిధ డివిజన్లలో నిర్వహించిన ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమాల్లో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు..జీడిమెట్ల డివిజన్ పరిధిలోని జీడిమెట్ల, కుత్బుల్లాపూర్ గ్రామాల్లో యువ ఫౌండేషన్, టీం కుత్బుల్లాపూర్ సిండికేట్, హిందూవాహిని ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమంలో భరత్ సింహారెడ్డి పాల్గొన్నారు. భక్తులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.. ఈ సందర్భంగా నిర్వాహకులు, స్థానిక భక్తులతో కార్యక్రమ వివరాలను తెలుసుకున్నారు.. అనంతరం గణేష్ నగర్ డివిజన్ పరిధిలోని అంబేద్కర్ నగర్‌లో దిలీప్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు..





# మ్యాట్రిమోని సైట్‌లో పరిచయం.. రూ.45 లక్షలకు టోకరా !

**హైదరాబాద్ పెన్ పవర్:** మ్యాట్రిమోని వెబ్ సైట్ లో నమోదు చేసుకున్న ప్రొఫైల్ ఓ ప్రైవేటు ఉద్యోగి 45 లక్షలు పోగొట్టుకునేలా చేసింది. పెండ్లీ చేసుకొందామని పరిచయమైన యువతి డ్రాప్ షిప్పింగ్ పెట్టుబడులలో లాభాలంటూ నిండా ముంచింది. ఈ సంఘటన పై నమోదైన ఎఫ్ఐఆర్ వివరాల ప్రకారం హైదరాబాద్ హాయత్ నగర్ ప్రాంతానికి చెందిన (39) ప్రైవేటు ఉద్యోగి పేరొందిన మ్యాట్రిమోని వెబ్ సైట్ వివాహం చేసుకునేందుకు తన ప్రొఫైల్ ను నమోదు చేసుకున్నారు. ఈ ప్రొఫైల్ ను చూసిన ముంబయికి చెందిన మహిళ ప్రీతి గుప్తా(28) పేరుతో ఫోన్ చేసి పరిచయం చేసుకుంది. ఆ తర్వాత వాట్సాస్ కు చెందిన రెండు, టెలిగ్రాంకు చెందిన మరో ఫోన్ నెంబర్లను ఇచ్చి వాటిలో తరచు మాట్లాడింది. ఇలా మూడు నెలల పాటు ప్రైవేటు ఉద్యోగి ఆమెతో వాట్సాప్ కాల్స్, విడియో కాల్స్ , చాటింగ్ లు కొనసాగించాడు.

ఆ తర్వాత ఆమెను పూర్తిగా నమ్మాడు. ఆ సమయంలో మహిళ మన భవిష్యత్తు కోసం తాను పని చేస్తున్న డ్రాప్ షిప్పింగ్, ఇన్వెస్ట్ మెంట్ కంపెనికి సంబంధించిన వాటిలో భారీ లాభాలు వస్తాయని నమ్మించింది. ముందుగా 7500 పెట్టుబడితో ప్రారంభించి దాదాపు 45 లక్షల రూపాయాల వరకు పెట్టుబడి పెట్టించింది. వీటికి సంబంధించి ప్రైవేటు ఉద్యోగికి డ్రాప్ షిప్పింగ్ యాప్ లో కేటాయించిన ఐడీ పేజీలో లాభాలు కనిపిస్తున్నప్పటికి వాటిని విత్ డ్రా చేసుకొందామని ప్రయత్నిస్తే మీరు 30 శాతం టాక్స్ చెల్లించాలని యువతి కోరింది. ఇలా చివరకు అనేక విధాలుగా ప్రైవేటు ఉద్యోగిని కలవరపెట్టి చివరకు తన ఫోన్ లన్నింటిని స్విచ్ ఆఫ్ చేసింది. మరో ఫోన్ తో ప్రైవేటు ఉద్యోగి సంప్రదించేందుకు ప్రయత్నిస్తే ఆ నెంబరును యువతి బ్లాక్ చేసింది. దీంతో తాను మోసపోయానని భావించిన ప్రైవేటు ఉద్యోగి మల్కాజిగిరి సైబర్ క్రైం పోలీసు స్టేషన్ లో ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ చీటింగ్ పై పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తును ప్రారంభించారు.





హైదరాబాద్ జీడిమెట్ల విలేజ్‌లో బోనాల పండుగ సందడి.



భక్తిశ్రద్ధలతో బోనమెత్తిన మహిళలు, ఊరేగింపుగా నల్లపోచమ్మ అమ్మవారి ఆలయానికి..

# జీడిమెట్లలో ఘనంగా బోనాల పండుగ

## శ్రీ శ్రీ శ్రీ నల్లపోచమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించిన గ్రామస్థులు..

జీడిమెట్ల, పెన్ పవర్, ఆగష్టు 9: జీడిమెట్ల గ్రామంలో బోనాల పండుగ వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలను ఎత్తుకుని శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ పరిసరాలు భక్తుల రద్దీతో సందడిగా మారాయి. అమ్మవారి నామస్మరణలు, బోనాల ఊరేగింపులతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. బోనాల పండుగ సందర్భంగా జీడిమెట్ల గ్రామం పండుగ శోభను సంతరించుకుంది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని కుటుంబ సభ్యులకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ప్రార్థించారు..

# వరంగల్‌లో థానాకాన్--2026 రాష్ట్ర మహాసభ




హైదరాబాద్ పెన్ పవర్: వరంగల్ అరేపల్లిలోని వజ్రా గార్డెన్స్‌లో తెలంగాణ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ (థానా) ఆధ్వర్యంలో 11వ వార్షిక రాష్ట్ర మహాసభ థానాకాన్--2026 ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి వైద్యులు, చిన్న, మధ్యతరహా, పెద్ద ఆసుపత్రుల యాజమాన్య ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సమావేశంలో ఫైర్ సేఫ్టీ, ఐసీయూ ప్రోటోకాల్స్, రోగుల భద్రత, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం, ప్రభుత్వ ఆరోగ్య పథకాలు, టీపీఏలు, బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్, డిజిటల్ హెల్త్‌కేర్, మెడికల్ ఎథిక్స్ వంటి అంశాలపై నిపుణులతో శాస్త్రీయ చర్చలు, నిరంతర వైద్య విద్యా కార్యక్రమాలు (సీఎంఈ) నిర్వహించారు. ఈ సందర్భంగా థానా రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన డా. పి. ప్రవీణ్ మాట్లాడుతూ.. చిన్న, మధ్యతరహా ఆసుపత్రులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, వైద్య రంగంలోని సమస్యలను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో థానా రాష్ట్ర అధ్యక్షులు డా. అరుణ్ కటారి, ప్రధాన కార్యదర్శి డా. ఎం.వి. ప్రసాద్, కోశాధికారి డా. కె. అశోక్ కుమార్, మాజీ అధ్యక్షులు డా. ఎల్. సురేష్ గౌడ్, జాయింట్ సెక్రటరీ డా. ఎస్. నౌనిహాల్ సింగ్, ఉపాధ్యక్షులు డా. వి. అశోక్, డా. ఎన్. మహేష్ బాబు, డా. గుండేటి రమేష్, ఆర్గనైజింగ్ చైర్మన్ డా. పి. ప్రవీణ్, కో-చైర్మన్ డా. ముక్కా దిలీప్ కుమార్, సెక్రటరీ డా. ఎల్. నాగేశ్వర్ రావు, ట్రెజరర్ డా. వి. నరేష్ కుమార్, వరంగల్ సలహాదారులు డా. పి. కాళీ ప్రసాదరావు, డా. టి. నర్సింగ రెడ్డి, డా. కె. అశోక్ రెడ్డి, డా. వి. రాకేష్, డా. నరసింహరావు, డా. పి. విజయ చంద్ర రెడ్డి, డా. కస్తూరి ప్రమీల, డా. ఎం. శేషు మాధవ్, డా. విద్యాసాగర్, డా. దశరథం, డా. జి. రమేష్, డా. ఎం. సుదీప్, డా. పి. సుధీర్ కుమార్, డా. కొత్తగట్టు శ్రీనివాస్, డా. పి. ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**రాష్ట్ర ప్రభుత్వానికి థానాకాన్ విజ్ఞప్తులు...**

ఆరోగ్య సంరక్షణ కమిషన్, సమన్వయ కమిటీ ఏర్పాటు, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టంలో సవరణలు చేసి థానా ప్రతినిధులకు ప్రాతినిధ్యం కల్పించాలని థానాకాన్-2026 ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. చిన్న, మధ్యతరహా ఆసుపత్రులకు ఫైర్, కాలుష్య నియంత్రణ నిబంధనలను శాస్త్రీయంగా సరళీకరించాలని, పడకల సంఖ్య కంటే వైద్య సేవల నాణ్యతకే ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఆరోగ్యశ్రీ, పాత ఈహెచ్‌ఎస్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, నకిలీ వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు వైద్యులు, సిబ్బందికి బలమైన చట్టపరమైన రక్షణ కల్పించాలని థానాకాన్ అభిప్రాయపడింది. చిన్న ఆసుపత్రులను ఎంఎంస్ఎంఈలుగా గుర్తించి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలని థానాకాన్ ప్రతినిధులు కోరారు.

# జగిత్యాల బైపాస్ రోడ్డులో ఘోర ప్రమాదం



**జగిత్యాల టౌన్ పెన్ పవర్:** జగిత్యాల జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డు దేవి శ్రీ గార్డెన్ మూలమలుపు వద్ద ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అతివేగంగా వెళ్తున్న ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొనడంతో జగిత్యాలకు చెందిన కాశీపాక గంగాధర్ (22) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు గంగాధర్ స్థానిక ప్రైవేట్ ఈఎన్‌టీ ఆస్పత్రిలో ఉద్యోగం చేస్తున్నట్లు సమాచారం. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రమాద సమయంలో బైక్‌పై గంగాధర్‌తో పాటు ఆయన తాత పోచయ్య కూడా ప్రయాణిస్తున్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పోచయ్యను గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

# కృష్ణమ్మ ఉరకలు.. గోదావరి పరవళ్లు.. ప్రాజెక్టుల్లో పెరుగుతున్న నీరు!



**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలోని ప్రాజెక్టులు మెల్లమెల్లగా నిండుతున్నాయి. కృష్ణా, గోదావరి నుంచి వరద ప్రవాహాలు కొనసాగుతున్నాయి. ఆయా బేసిన్లలోని పలు ప్రాజెక్టులకు గణనీయమైన ఇన్‌ఫ్లోలు కొనసాగుతున్నాయి. ఆల్మట్టి ప్రాజెక్టుకు 24 గంటల్లో సగటున 1,05,332 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. జూరాలకు 1,59,318 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. జూరాల నుంచి వివిధ మార్గాల ద్వారా భారీగా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు కూడా 1,67,520 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. శ్రీశైలంలో 178.74 టీఎంసీల నీటి నిల్వ ఉండగా, ప్రస్తుత నీటిమట్టం 878.10 అడుగులుగా ఉంది. నాగార్జునసాగర్‌కు 63,215 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, జలాశయంలో 145.29 టీఎంసీల నీరు ఉన్నది.అటు.. గోదావరి బేసిన్లో కూడా పలు ప్రాజెక్టుల్లోకి భారీగా నీరు వచ్చి చేరుతున్నది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 24 గంటల్లో 17,127 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. ప్రాజెక్టులో 41.70 టీఎంసీల నీటి నిల్వ ఉంది. శ్రీపాద ఎల్లంపల్లికి 4,357 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, జలాశయంలో 16.01 టీఎంసీల నీరు ఉంది. మరోవైపు ధవళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం భారీ స్థాయిలో కొనసాగుతోంది. 24 గంటల్లో 1,84,546 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవగా, 1,69,946 క్యూసెక్కులను డెల్టా కాలువలకు విడుదల చేస్తున్నారు. అదనంగా 14,600 క్యూసెక్కులు సముద్రంలోకి మళ్లుతున్నాయి.

# ధర్మవరంలో కోళ్ల పందాలపై పోలీసుల దాడి.. ఆరుగురి అరెస్ట్




**హైదరాబాద్ పెన్ పవర్:** జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం కోదండపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ధర్మవరం గ్రామంలో అనుమతి లేకుండా కోళ్ల పందాలు నిర్వహిస్తున్న స్థావరంపై ఆదివారం పోలీసులు ఆకస్మిక దాడి చేశారు. నమ్మదగిన సమాచారం మేరకు కోదండపురం ఎస్ఐ తరుణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా కోళ్ల పందాలు నిర్వహిస్తున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.10,500 నగదు, 4 బైకులు, 6 సెల్‌ఫోన్లు, ఒక పందెం కోడితో పాటు పందేలకు ఉపయోగించే కత్తులను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తరుణ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ప్రజలు అక్రమ కోడి పందాలు, బెట్టింగ్, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచిస్తూ, ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించిన, ప్రోత్సహించిన, పాల్గొనే వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

# బాదేపల్లి అయ్యప్ప ఆలయానికి ఎమ్మెల్యే అండ

**హైదరాబాద్ పెన్ పవర్:** జడ్చర్ల పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం డైనింగ్ హాల్ నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి భారీ విరాళం అందించడంతో నిర్మాణ పనులు దాదాపుగా పూర్తి అయ్యాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని జడ్చర్ల పట్టణంలోని బాదేపల్లి శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ సభ్యులు జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి చిరు సన్మానంతో కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయ డైనింగ్ హాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే అందించిన గొప్ప విరాళానికి ఆలయ కమిటీ సభ్యులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.భక్తుల సౌకర్యార్థం డైనింగ్ హాల్ నిర్మాణానికి ఆయన అందిస్తున్న సహకారాన్ని ప్రత్యేకంగా కొనియాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆలయ కమిటీకి భరోసా ఇస్తూ, డైనింగ్ హాల్ నిర్మాణంలో మరో స్లాబ్ నిర్మాణానికి కూడా సహకరిస్తానని, మిగిలిన నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు తన పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే సహకారం భక్తులందరికీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు అన్నారు.

## నరేంద్ర మోడీకి దేశాన్ని పాలించే హక్కు లేదు




మాట్లాడుతున్న సిపిఐ జిల్లా కార్యదర్శి విజయసారధి

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 9:** నరేంద్ర మోడీకి దేశాన్ని పాలించే హక్కు లేదని సిపిఐ జిల్లా కార్యదర్శి విజయ సారధి అన్నారు. ఆగస్టు 6 నుండి 14 వరకు జరగనున్న ప్రజా చైతన్య యాత్రలో భాగంగా గార్ల మండల పరిధిలోని మద్దివంచ గ్రామంలో ఆదివారం సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం గత 12 ఏళ్లుగా దేశాన్ని అధోగతి పాలు చేశాడని ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇవ్వలేదని ప్రభుత్వ రంగ సంస్థలని ఆదాని అంబానీలు కట్టబెడుతున్నాడని మహిళలపై అత్యాచారాలు పెరిగిపోయాయని విద్యా వైద్యం పేదల నుండి దూరం చేశాడని రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ సిబిఐ ఈడి ఈసి చివరికి కోర్టులను కూడా తన జేబు సమస్యలుగా మార్చుకొని ప్రశ్నించే గొంతులను ప్రతిపక్షాలను లేకుండా చేయాలని చూస్తున్నాడని మరోపక్క అన్ని రకాల నిత్యావసర సరుకులు ధరలు గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలు విపరీతంగా పెంచి వేసి ప్రజల నడ్డి విరుస్తున్నాడని లక్షల కోట్లు కార్పొరేట్లకు రాయితీలు ఇస్తున్నాడని ఇది ప్రజల ప్రభుత్వం కాదని కార్పోట్లు ప్రభుత్వమని కేంద్రం ఆధీనంలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగాన్ని భర్తీ చేయకుండా నిరుద్యోగులతో చెలగాటం ఆడుతున్నాడని దేశంలో ప్రశ్నా పత్రాలు లీకేజీ పరంపర కొనసాగుతున్నదని ఇందుకు పరాకాష్టగా నీట్ లీకేజ్ వల్ల విద్యార్థులు 21 మంది మరణించారని అన్నారు. లక్షల మంది విద్యార్థుల జీవితాలతో చలగాటం మోడీ ప్రభుత్వం ఆడుతుందన్నారు బిజెపి యువజన విధానాలకు వ్యతిరేకంగాప్రజా చైతన్య యాత్ర కొత్తతండా పులిగుట్ట తండా రాంపురంముల్కనూరునరసింహులగూడెం పెద్ద కిస్టాపురం చిన్న కిస్టాపురం సీతంపేట శేరిపురం మర్రిగూడెం ముత్తి తండా గ్రామాల మీదుగా జరగనుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, సహాయ కార్యదర్శి రాగం రమేష్, కృష్ణమూర్తి, ధూపాటి జనార్ధన్, మేదరమెట్ల గిరిప్రసాద్, భూక్య హరినాయక్, బయ్యారం మండల కార్యదర్శి సారిక శ్రీనివాస్, సింగు రమేష్, మాగం లోకేష్, బోగెల్లి కోటేశ్వరీ, వేంకటనరసమ్మ సింగు రాజ్యం, ధారవత్ లక్మి, పుల్ సింగ్, మంగీలాల్, శ్రీనివాస్, ఇల్లుటూరి వెంకన్న, బిక్షం, తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



మాట్లాడుతున్న ఆదివాసి సంఘం నాయకులు రాము

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 9:** సమస్యల పరిష్కారం కోసం ఆదివాసీలంతా సంఘటితమవ్వాల్సిన అవసరం ఉందని ఆదివాసి అధ్యక్షులు ఎట్టి రాము అన్నారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం గార్ల మండల కేంద్రంలోని స్థానిక నెహ్రూ సెంటర్ తాసిల్దార్ కార్యాలయం ఎదుట గల కొమరం భీమ్ విగ్రహం వద్ద ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించి ఆదివాసి జెండా ఆవిష్కరణ చేశారు అనంతరం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఆదివాసీలు తమ హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని, విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని సూచించారు. ఆదివాసీ ప్రాంతాల్లో విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వాలు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అస్తిత్వం, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు వట్టం లింగరాజు, ఇన్చార్జ్ హెచ్ఎం మోకాల రామచంద్రు, ఏటీఎఫ్ గార్ల మండల అధ్యక్షులు జబ్బా వీరస్వామి, వార్డు నెంబర్ కిన్నెర సాయి, ప్రధాన కార్యదర్శి కబ్బాకుల వెంకన్న, నాయక్ పోడు సంఘం బాధ్యులు కిన్నెర శ్రీనివాస్, ఆదివాసి ప్రధాన కార్యదర్శి పటేల్ తాటి రవి, తదితరులు పాల్గొన్నారు.

## పారిశ్రామిక వాడలకు కొత్త రూపు.. విద్యుత్, డ్రైనేజీ, ఫెన్సింగ్ పనులకు టెండర్లు

టీజీఐఐసీ ఆధ్వర్యంలో వివిధ పారిశ్రామిక పార్కులు, పరిశ్రమల ప్రాంతాలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించి 8 టెండర్లను ఆహ్వానించారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్ఖాన్పేట్లోని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి 11 కేవీ హెచ్టీ విద్యుత్ సరఫరా విస్తరణ పనులకు రూ.1.80 కోట్ల అంచనా విలువతో టెండర్లు పిలిచారు. 2400 కేవీఏ, 3217 హెచ్పీ కనెక్టెడ్ లోడ్కు అనుగుణంగా ఈ పనులు చేపట్టనున్నారు. అలాగే.. నాగర్కర్నూల్ డివిజన్లోని వంగూరు మండలం సర్వారెడ్డిపల్లి గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం 33/11 కేవీ సబ్స్టేషన్ నిర్మాణానికి రూ.2.01 కోట్ల అంచనా వ్యయంతో టెండర్ జారీ చేశారు. ఇందులో 33 కేవీ, 11 కేవీ వీసీబీలు, కంట్రోల్ రూమ్, స్విచ్యార్డ్ రిటైనింగ్ వాల్, కాంపౌండ్ వాల్ నిర్మాణాలు ఉన్నాయి. సిద్దిపేట జిల్లా వర్గల్లోని 845 సర్వే నంబర్లో ఫేజ్-1లో నిర్మిస్తున్న 549 హౌసింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ యూనిట్లకు 11 కేవీ విద్యుత్ సరఫరా కల్పించేందుకు రూ.99.88 లక్షల అంచనా విలువతో మరో టెండర్ను ఆహ్వానించారు.

**సీతారాంపూర్ ప్రాంతంలో డ్రైనేజీ**

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం సీతారాంపూర్లోని ఇండస్ట్రియల్ పార్క్, యూడీఎల్ పరిధిలోని అంతర్గత రహదారులు, ఇతర రోడ్లకు స్టార్మ్ వాటర్ డ్రెయిన్ల నిర్మాణానికి రూ.11.62 కోట్ల అంచనా వ్యయంతో టెండర్ పిలిచారు. యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం డి.రేపాకలో ప్రతిపాదిత ఇండస్ట్రియల్ పార్క్ చుట్టూ బార్బ్ వైర్ ఫెన్సింగ్ కోసం రూ.1.22 కోట్ల అంచనా వ్యయంతో టెండర్ జారీ చేశారు. అదే జిల్లాలోని ఎం.తుర్కపల్లిలో ప్రతిపాదిత ఇండస్ట్రియల్ పార్క్కు ఫెన్సింగ్ పనులకు రూ.89.36 లక్షలు కేటాయించారు. సూర్యాపేట జిల్లా హుజూర్నగర్లో ప్రతిపాదిత ఫుడ్ పార్క్/అగ్రికల్చర్ ప్రాసెసింగ్ జోన్ చుట్టూ బార్బ్ వైర్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు రూ.84.30 లక్షల అంచనా వ్యయంతో టెండర్ పిలిచారు. మహబూబ్నగర్ జిల్లాలోని దివిటిపల్లి ఐటీ టవర్, దివిటిపల్లి ఇండస్ట్రియల్ పార్క్ తదితర ప్రాంతాల్లో క్యాసెట్ ఏసీలు, సంప్ మోటార్లు, సీసీటీవీ, యూపీఎస్, డీజిల్ జనరేటర్, ఎల్ఈడీ లైటింగ్, ఫైర్ఫైటింగ్, ఎలక్ట్రికల్ యార్డ్ తదితరాలకు వార్షిక విద్యుత్ మరమ్మతులు, నిర్వహణ పనులకు రూ.41.14 లక్షల అంచనా వ్యయంతో టెండర్ ఆహ్వానించారు. కాగా.. ఈ టెండర్లకు సంబంధించిన బిడ్ డౌన్లోడ్ ప్రక్రియ ఈ నెల 7 నుంచి ప్రారంభమైంది. బిడ్ల సమర్పణకు చివరి గడువు ఆగస్టు 22, 2026 మధ్యాహ్నం 3 గంటల వరకు ఉంది. టెండర్ వివరాలు, బిడ్ డాక్యుమెంట్లను తెలంగాణ ఈ-ప్రొక్యూర్మెంట్ వెబ్సైట్లో పొందుపరిచినట్లు టీజీఐఐసీ తెలిపింది.

## 'ఎల్లో అలర్ట్' జారీ చేసిన వాతావరణ శాఖ.. ఆ జిల్లాల్లో భారీ వర్షాలు!

**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రవ్యాప్తంగా రాబోయే 24 గంటల్లో పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ మేరకు రాష్ట్రంలోని పలు జిల్లాలకు 'ఎల్లో అలర్ట్' (వశ్రీశ్రీశీష ాూశ్రీవతీ) జారీ చేస్తూ హెచ్చరికలు జారీ చేసింది. రాజధాని హైదరాబాద్తో పాటు కామారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, మెదక్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అలాగే ములుగు, నల్గొండ, నారాయణపేట, సంగారెడ్డి, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు పడే సూచనలు ఉన్నట్లు స్పష్టం చేశారు.
అదేవిధంగా వర్షంతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఈదురుగాలులు, ఉరుముల

తీవ్రత ఎక్కువ ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ముఖ్యంగా వాహనదారులు, విద్యుత్ స్తంభాలు, చెట్ల కింద నిలబడవద్దని సూచించారు. రైతులు కూడా తమ పంటల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## సర్.. ఒక్క హైదరాబాద్ లోనే 40 లక్షల ఓట్లు కట్.. మునిగేదెవరు?



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు ఏ ఇద్దరు నేతలు కలిసినా.. ఏ టీ కొట్టు దగ్గర చూసినా ఒకటే ముచ్చట.. అదే 'ఎస్.ఐఆర్' సర్వే గురించిన రగడ.. ఐటీ కారిడార్లో ఏసీ రూముల్లో కూర్చుని సిస్టమ్స్ ముందు కోడింగ్ రాసే పౌరుల నుంచి.. భాగ్యనగరపు సందు చివర సవారీ చేసే నేతల వరకు అందరి గుండెల్లో ఇప్పుడు రైళ్లు పరిగెడుతున్నాయి. ఉమ్మడి రాజధానిగా బిర్యానీ రాజధానిగా పేరొందిన మన హైదరాబాద్లో ఏకంగా 40 లక్షల ఓట్లు గాల్లో తేలిపోతున్నాయన్న వార్త పొలిటికల్ సర్కిళ్లలో పెను భూకంపమే సృష్టిస్తోంది. హైదరాబాద్ నగరం పరిధిలోని మొత్తం 47.36 లక్షల మంది ఓటర్లలో ఇప్పటివరకు డిజిటైజ్ అయింది దాదాపు 57 శాతమే కావడంతో మిగతా 40 శాతానికి పైగా ఓటర్ల వివరాలు "అసలు ఉన్నారా లేక మాయమయ్యారా" అనే ఉత్కంఠ నెలకొంది. దీనికి తోడు మన బూత్ లెవల్ ఆఫీసర్లు గడప తొక్కినా చిక్కని మహానుభావులు, ఆంధ్రాలో ఒక ఓటు వేసి ఇక్కడొక ఓటుతో ఎంజాయ్ చేసే 'డబుల్ రోల్' లీడర్లు.. ఇళ్లు మారి కొత్త అడ్రస్ చెప్పని వాళ్లు కలిసి ఏకంగా 9.95 లక్షల మందిని 'ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్' జాబితాలో కూర్చోబెట్టేశారు.
మరోవైపు త్వరలోనే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల కురుక్షేత్రం రాబోతోందని భావించి.. ఇప్పటినుంచే ప్లాన్లు వేస్తూ బిర్యానీ ప్యాకెట్లు, సంక్షేమ పథకాల క్యాలెండర్లు సిద్ధం చేసుకుంటున్న రాజకీయ పార్టీలకు ఈ ఓట్ల గల్లంతు వార్త తీవ్ర దిగ్భ్రాంతిని కలిగిస్తోంది. ముఖ్యంగా "సొంత ఊర్లో పండక్కి వెళ్ళి ఓటు వేస్తాం.. ఇక్కడ హైదరాబాద్ లో సెటిలై రియల్ ఎస్టేట్ చూసుకుంటాం" అనుకునే వలస జీవుల పేర్లు జాబితా నుంచి ఊడిపోతే తమ పరిస్థితి ఏంటని ఏపీ ఓటర్ల పైన ఆశలు పెట్టుకున్న కొన్ని పార్టీల నేతలు తలలు పట్టుకుంటున్నారు.
ఇక నియోజకవర్గాల వారీగా చూస్తే బహదూర్ పురా, సికింద్రాబాద్ పరిధిలో డిజిటైజేషన్ 60 శాతానికి పైగా పూర్తయితే.. సనత్ నగర్, మలక్పేట, ముషీరాబాద్లలో మాత్రం ఇంకా ఆమడ దూరంలోనే బండి నడుస్తోంది. దీంతో ఏ ఏరియాలో ఎవరి డిపాజిట్ ఎగిరిపోతుందో ఏ ఏరియాలో గెలుపు గుర్రాలు రేసు నుంచి తప్పుకుంటాయో తెలియక స్థానిక కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు బీఎల్వోల వెనకాల ప్రదక్షిణలు చేస్తున్నారు. రెండు ప్రాంతాల్లో ఓటు హక్కు అనుభవించడం తమ ప్రాథమిక హక్కు అనుకున్న సగటు హైదరాబాదీకి, ఎలక్షన్ కమిషన్ వచ్చి ఒకే చోట ఓటు అని మెలిక పెట్టడంతో ఎటు పాలుపోని పరిస్థితి ఏర్పడింది. ఆగస్టు 10తో ఎన్యూమరేషన్ గడువు ముగుస్తుండటంతో నా ఓటు ఉంటుందో ఊడుతుందో అని సగటు ఓటరు, పక్క పార్టీ ఓటు పోతే చాలు అని ప్రార్థించే నేతల మధ్య ఈ సర్వే ఒక పెద్ద సస్పెన్స్ థ్రిల్లర్ను తలపిస్తోంది. చూడాలి మరి ముసాయిదా ముగిసి తుది జాబితా వచ్చేసరికి ఎంతమంది హైదరాబాదీలకు ఓటు మిగులుతుందో, ఎంతమంది బడా నేతల సీట్లకు ఎసరు వస్తుందో..

## తెలంగాణ కాంగ్రెస్‌లో కొత్త ఫార్ములా.. నాలుగు వర్గాలకు నాలుగు కీలక పదవులు



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ కాంగ్రెస్లో సంస్థాగత మార్పులపై చర్చ మళ్లీ ఊపందుకుంది. టీపీసీసీని మరింత బలోపేతం చేయడంతో పాటు.. పార్టీలో సామాజిక, ప్రాంతీయ సమతుల్యతను పాటించేలా కొత్త నాయకత్వ నిర్మాణానికి కాంగ్రెస్ అధిష్ఠానం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీకి నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లను నియమించే ప్రతిపాదన తెరపైకి వచ్చినట్లు తెలుస్తోంది. పార్టీ ఇన్చార్జి మీనాక్షి ఆధ్వర్యంలో జరిగిన కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో ఈ అంశంపై విస్తృతంగా చర్చ జరిగినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

**ఒక్కరి చేతుల్లో కాకుండా.. బహుళ నాయకత్వం**

ప్రస్తుతం టీపీసీసీ అధ్యక్షుడిగా మహేశ్ కుమార్ కొనసాగుతున్నారు. ఆయన బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకుడు కావడంతో.. మిగిలిన ప్రధాన సామాజిక వర్గాలకు కూడా రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వంలో ప్రాధాన్యం కల్పించాలనే ఆలోచనతో అధిష్ఠానం ముందుకు వెళ్తున్నట్లు సమాచారం. పార్టీకి వివిధ వర్గాల్లో మరింత బలమైన ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు.. ఆయా సామాజిక వర్గాల నాయకులను సమన్వయం చేసుకునేందుకు ఈ ఫార్ములాను అమలు చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకే పీసీసీ అధ్యక్షుడిపై సంస్థాగత బాధ్యతలన్నీ కేంద్రీకృతం కాకుండా.. నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లకు బాధ్యతలు అప్పగించడం ద్వారా పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలనే ఉద్దేశం ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పార్టీ యంత్రాంగాన్ని యాక్టివ్గా ఉంచేందుకు ఈ మార్పులు ఉపయోగపడతాయని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం.

**నాలుగు సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం**

వర్కింగ్ ప్రెసిడెంట్ పదవుల కోసం సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని పేర్లను పరిశీలించినట్లు తెలుస్తోంది. ఎస్సీ వర్గం నుంచి సంపత్ కుమార్, ఎస్టీ వర్గం నుంచి బలరాం నాయక్, మైనారిటీ వర్గం నుంచి అజ్మతుల్లా లేదా ఒబైదుల్లా, ఓసీ వర్గం నుంచి రోహిన్ రెడ్డి లేదా పద్మావతి రెడ్డి పేర్లు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. అయితే వీరిలో తుది ఎంపిక ఎవరికి దక్కుతుందనే విషయంలో ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఈ పేర్లను జాతీయ నాయకత్వం పరిశీలించి తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ప్రస్తుతం టీపీసీసీలో కొనసాగుతున్న నాయకత్వ సమీకరణాల్లో ఈ నిర్ణయం ఎలాంటి మార్పులు తీసుకురాబోతుందనే ఆసక్తి నెలకొంది.

**జగ్గారెడ్డికి కీలక బాధ్యత?**

వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకంతో పాటు ప్రచార కమిటీ ఛైర్మన్ పదవిపైనా కాంగ్రెస్లో చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఈ పదవికి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పేరు బలంగా వినిపిస్తోంది. పార్టీ ప్రచారాన్ని సమన్వయం చేయడం.. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, ప్రతిపక్షాల విమర్శలకు రాజకీయంగా సమాధానం ఇవ్వడం వంటి అంశాల్లో ప్రచార కమిటీ కీలక పాత్ర పోషించనుంది. జగ్గారెడ్డికి ఈ బాధ్యత అప్పగిస్తే.. పార్టీ ప్రచార వ్యవస్థకు ఒక స్పష్టమైన నాయకత్వం లభించే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం.

**సామాజిక సమీకరణమే అసలు వ్యూహమా?**

తెలంగాణ రాజకీయాల్లో సామాజిక సమీకరణాలు ఎప్పటికప్పుడు కీలకంగా మారుతున్నాయి. ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఓసీ వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా పార్టీకి విస్తృతమైన సామాజిక మద్దతు సమీకరించుకోవాలని కాంగ్రెస్ భావిస్తున్నట్లు కనిపిస్తోంది.
అయితే నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్ల ఫార్ములా కేవలం పదవుల పంపిణీకే పరిమితమైతే ఆశించిన ఫలితం రాకపోవచ్చు. ఎవరికెంత బాధ్యత? ఏ ప్రాంతంపై ఎవరి పట్టు? పార్టీ నిర్ణయాల్లో వారి పాత్ర ఎంత? అనే అంశాలపై స్పష్టత అవసరం. లేదంటే బహుళ నాయకత్వం పార్టీకి బలంగా మారాల్సింది పోయి.. అంతర్గత పోటీకి కారణమయ్యే ప్రమాదం కూడా ఉంటుంది. మొత్తంగా చూస్తే.. టీపీసీసీలో ప్రతిపాదిత మార్పులు కేవలం కొత్త పదవుల భర్తీగా చూడలేం. తెలంగాణలో కాంగ్రెస్ తన సామాజిక పునాదిని మరింత విస్తరించుకోవడంతో పాటు.. పార్టీని ఎన్నికలకు మరింత సన్నద్ధం చేసే వ్యూహంలో భాగంగానే ఈ కసరత్తు జరుగుతున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పుడు అందరి దృష్టి అధిష్ఠానం తుది నిర్ణయంపైనే ఉంది. ఎవరికి వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి దక్కుతుంది? ప్రచార కమిటీ పగ్గాలు జగ్గారెడ్డికే వస్తాయా? అన్నది త్వరలోనే తేలనుంది.

# విస్తరణకు వేళాయెరా...మోడీ రెడీ ?



**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్ర మంత్రివర్గ విస్తరణకు వేళాయేనా అంటే హస్తినలో జరుగుతున్న ప్రచారం చూస్తే అదే నిజం అనిపిస్తోంది అంటున్నారు. ఎందుకంటే పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈ నెల 13 తో ముగుస్తున్నాయి. అంటే మూడు రోజులు మాత్రమే ఉంది. అయితే ఇప్పటిదాకా జరిగిన సమావేశాలలో చూస్తే పెద్దగా బిజినెస్ సాగింది లేదని అంటున్నారు. ప్రతీ రోజూ విపక్షాలు సభలో చేపట్టే ఆందోళనలు గందరగోళం మధ్యన ఉభయ సభలు వాయిదా పడుతూ వస్తున్నాయి. దాంతో వర్షాకాల సమావేశాలు అన్నీ వాయిదాలకే సమర్పితం అయిపోయాయి. ఈ సమావేశాలలో విదేశీ నిధుల అక్రమ ప్రవాహాన్ని, దేశ భద్రతకు భంగం కలిగించే విరాళాలను నియంత్రించడానికి భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన చట్టం విదేశీ సహకారం నియంత్రణ బిల్లుని ఆమోదించుకోవాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోంది. అది పూర్తి అయిన తరువాత పార్లమెంట్ సమావేశాలు ముగుస్తాయని అంటున్నారు.

**కొత్త మంత్రులొస్తున్నారు :**
ఇదిలా ఉంటే కేంద్ర మంత్రి వర్గ విస్తరణకు మోడీ ప్రభుత్వం ఇపుడు సిద్ధం అవుతోంది అని అంటున్నారు. ప్రస్తుతం ఉన్న మంత్రులలో విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో ఆయన శాఖను అదనపు బాధ్యతగా మరో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీకి ఇవ్వాల్సి వచ్చింది. ఆయన వద్ద ఇప్పటికే ఇతర శాఖలు ఉన్నాయి. అలాగే రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్ వద్ద ఐటీ సమాచార శాఖలు ఉన్నాయి. ఇదే తీరున అనేక మంది మంత్రుల వద్ద ఒకటికి మించి ఎక్కువగా శాఖలు ఉన్నాయని అంటున్నారు. అందువల్ల వారికి భారం తగ్గించాలని ఎప్పటి నుంచో ఉంది. అదే విధంగా మంత్రుల సమర్ధత పనితీరు వంటివి బేరీజు వేసుకుంటున్న కేంద్రం ప్రభుత్వం కొందరిని తప్పించాలని చూస్తోంది అని కూడా ప్రచారంలో ఉంది.

**వీరందరికీ సర్దుబాటు :**
అలాగే బీజేపీ మిత్రులకు ఈసారి పెద్ద పీట వేయాలని చూస్తున్నారు. అలాగే బీహార్ మాజీ సీఎం నితీశ్ కుమార్ ని కేంద్ర మంత్రి వర్గంలోకి తీసుకోబోతున్నారు. ఇక కొంత మంది కేంద్ర మంత్రులను పార్టీ పనికి పురమాయించబోతున్నారు, మరి కొందరిని గవర్నర్లుగా పంపించబోతున్నారు అని తెలుస్తోంది. తృణమూల్ కాంగ్రెస్ నుంచి వచ్చిన ఇరవై మంది ఎంపీలు, అలాగే శివసేన ఉద్ధవ్ థాక్రేకి చెందిన ఆరుగురు ఎంపీలు, ఆప్ నుంచి వచ్చిన ఎనిమిది మంది ఎంపీలకు ఈసారి విస్తరణలో కచ్చితంగా చాన్స్ ఉంటుందని అంటున్నారు. ఇలా చూసుకుంటే చాలా మంది ఆశావహులకు సర్దుబాటు చేయాల్సి ఉంటుందని అంటున్నారు. ఈ మొత్తం కసరత్తు అయితే ఒక లెక్కకు వచ్చిందని చెబుతున్నారు.

**మరింత పటిష్టంగా :**
కేంద్ర మంత్రి వర్గంలో బాగా పనిచేసే వారిని ప్రతిపక్షాలను కట్టడి చేసే వారిని తీసుకోవాలని చూస్తున్నారు. అదే విధంగా కేంద్ర మంత్రి వర్గం కొత్తగా జనాల్లో కనిపించాలని ప్రయత్నం కూడా ఉంది. వచ్చే ఏడాది ఉత్తరప్రదేశ్ గుజరాత్ వంటి రాష్ట్రాలకు ఎన్నికలు ఉన్నాయి. దాంతో అక్కడ వివిధ సామాజిక వర్గాలకు న్యాయం చేస్తూ కేంద్ర మంత్రి వర్గంలో చోటు కల్పించాలని కూడా వ్యూహం ఉంది అని అంటున్నారు. ఇక ముందు ఉన్నవి అన్నీ మంచి రోజులే కాబట్టి మోడీ మంత్రి వర్గ విస్తరణ ఈ నెలలో జరగవచ్చు అని అంటున్నారు. ఈ నెల 15న స్వాతంత్య్ర వేడుకలు ఉన్నాయి. అది ముగిసిన తరువాత ఎపుడైనా కేంద్ర మంత్రివర్గ విస్తరణ ఉండొచ్చు అన్న టాక్ అయితే దేశ రాజధానిలో జోరుగా సాగుతోంది. చూడాలి మరి కొత్త మంత్రులు ఎవరు ఏమిటి అన్నది.

# లోకేశ్ పై ఫార్చ్యూన్ ఇండియా సంచలన కథనం.. ఎందుకు అంటే..?

**హైదరాబాద్ పెన్ పవర్:** రాజకీయాల్లో వారసత్వం అనేది ఒక మెట్టు మాత్రమే, కానీ ఆ మెట్టుపై నిలబడి గమ్యాన్ని చేరుకోవడానికి కావాల్సిన శ్రమ, పట్టుదల ఉంటేనే చరిత్ర గుర్తిస్తుంది. టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఇలాంటి గుర్తింపు సాధించారా? అన్నదే ఇప్పుడు ఆసక్తికర ప్రశ్నగా మారింది. ప్రఖ్యాత ఇంగ్లీష్ పత్రిక ఫార్చ్యూన్ ఇండియా తన ఆగస్టు సంచికలో మంత్రి లోకేశ్ పై ప్రచురించిన కథనం ఇప్పుడు హాట్ టాపిక్ అవుతోంది. 'ఆంధ్రాస్ రైజింగ్ స్టార్' అంటూ మంత్రి లోకేశ్ ను ప్రశంసిస్తూ ఒక లీడ్ స్టోరీని ప్రచురించింది. గతంలో ట్రోల్స్, విమర్శలతో సతమతమైన నారా లోకేశ్, నేడు 'ఫార్చ్యూన్ ఇండియా' వంటి ప్రముఖ మీడియా గుర్తించే స్థాయికి ఎలా ఎదిగారు? అన్న చర్చ ఎక్కువ జరుగుతోంది.

మంత్రి లోకేశ్ పనితీరుతో ఇప్పుడు ఒక రాజకీయ నాయకుడి ఇమేజ్ కు మాత్రమే పరిమితం కాలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త 'టెక్నో-పొలిటికల్' శకానికి ఆయన దారులు వేస్తున్నారని చెబుతున్నారు. ప్రతిష్టాత్మక ఫార్చ్యూన్ ఇండియా పత్రిక ఆగస్టు 2026 సంచికలో "ఆంధ్రప్రదేశ్ రైజింగ్ స్టార్"గా అభివర్ణించిందని వ్యాఖ్యానిస్తున్నారు. గత రెండేళ్లలో మంత్రిగా లోకేశ్ పనితీరు జాతీయస్థాయిలో నేతలు, పారిశ్రామిక, వ్యాపార దిగ్గజాలను ఆకట్టుకుందని చెబుతున్నారు. దీంతో రాష్ట్రంలో లోకేశ్ ప్రాబల్యం పెరగడమే కాకుండా, ఆయనకు దేశవ్యాప్తంగా గుర్తింపు దక్కుతోందని అంటున్నారు.

2019కి ముందు ప్రజలు లోకేశ్‌ను కేవలం ఒక ముఖ్యమంత్రి కుమారుడిగా, రాజకీయ పరిపక్వత లేని నాయకుడిగా చిత్రీకరించే ప్రయత్నం చేశారని పరిశీలకులు గుర్తు చేస్తున్నారు. ఆ సమయంలో సోషల్ మీడియాలో ఆయనపై జరిగిన ట్రోలింగ్ అంతా ఇంతా కాదు. కానీ, 2024 ఎన్నికల విజయం తర్వాత ఆయన తన శైలిని, వ్యూహాలను సమూలంగా మార్చుకున్నారని పరిశీలకులు చెబుతున్నారు. ముఖ్యంగా వేలాది కిలోమీటర్ల మేర సాగిన 'యువగళం' పాదయాత్ర ఆయనను ప్రజలకు అత్యంత సన్నిహితం



చేయడమే కాకుండా, ఆయనలోని సహనశక్తిని, నాయకత్వ పటిమను బయటపెట్టిందని చెబుతున్నారు. ఆ కష్టతరమైన ప్రయాణంలో నేర్చుకున్న పాఠాలే, నేడు మంత్రిగా ఆయన తీసుకుంటున్న సాహసోపేతమైన నిర్ణయాలకు పునాదిగా మారాయని విశ్లేషిస్తున్నారు. ఒకప్పుడు ఆయనను తక్కువ చేసి చూసిన వారే, నేడు ఆయన పనితీరును విధిగా పరిశీలించాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు.

ప్రస్తుతం ఆయన నిర్వహిస్తున్న ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యారంగ శాఖలో లోకేశ్ మార్పుకు అసలైన అర్థం పడుతున్నాయని చెబుతున్నారు. పాలన అంటే కేవలం ప్రభుత్వ ఫైళ్లపై సంతకాలు చేయడం మాత్రమే అనుకునే పద్ధతికి స్వస్తి పలికి, లోకేశ్ పూర్తిస్థాయిలో ఎగ్జిక్యూషన్ పై దృష్టి పెట్టారని చెబుతున్నారు. విశాఖపట్నంలో గూగుల్ వంటి గ్లోబల్ దిగ్గజాల పెట్టుబడులను ఆకర్షించే దిశగా ఆయన సాగించిన మంతనాలు, ఏపీని ఒక ప్రముఖ టెక్ హబ్‌గా మార్చాయని చెబుతున్నారు. ఇటీవల దక్షిణ కొరియాలో ఆయన చేసిన పర్యటనతో ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, ఈవీ, బ్యాటరీ రంగాల దిగ్గజ కంపెనీలను ఏపీకి రప్పించేలా సాగిందని అంటున్నారు. అదేసమయంలో రాష్ట్రవ్యాప్తంగా 22 పారిశ్రామిక క్లస్టర్లను అభివృద్ధి చేస్తూ పెట్టుబడులకు అనువైన వాతావరణాన్ని సృష్టిస్తున్నారని చెబుతున్నారు. కేవలం పరిశ్రమలు, ఐటీ రంగానికే పరిమితం కాకుండా, రాష్ట్ర విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ఆయన ఒక 'హోలిస్టిక్ అప్రోచ్'ను అనుసరిస్తున్నారని చెబుతున్నారు. ఉపాధ్యాయుల బదిలీల్లో పూర్తి పారదర్శకతను తీసుకురావడం, మెగా డీఎస్సీ ద్వారా లక్షలాది నిరుద్యోగుల్లో కొత్త ఆశలను చిగురింపజేయడం వంటి చర్యలు వ్యవస్థలో పెనుమార్పులకు శ్రీకారం చుట్టారని అంటున్నారు. అంతేకాకుండా, రాబోయే రోజుల్లో రాష్ట్రానికి రాబోయే పరిశ్రమలకు అవసరమైన నిపుణులైన మానవ వనరులను తయారు చేయడానికి 'స్కిల్-బేస్డ్ ఎడ్యుకేషన్'కు ఆయన అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని చెబుతున్నారు. విద్యను, ఉపాధిని అనుసంధానిస్తూ ఆయన వేస్తున్న అడుగులు భవిష్యత్ తరాలకు మేలు చేసేలా ఉన్నాయి. ఈ పరివర్తనలో లోకేశ్ కేవలం పాత తరం రాజకీయ నాయకులకు మాత్రమే పరిమితం కాకుండా, నేటి 'జెన్-జీ' యువతతో నిరంతరం మమేకమవుతున్నారని చెబుతున్నారు. రాజకీయాల్లోకి యువతను ఆహ్వానించడం, వారి ఆలోచనలను పరిపాలనలోకి చొప్పించడం ఆయన ప్రత్యేకత అంటున్నారు. ఇక 'ఫార్చ్యూన్ ఇండియా' ఇచ్చిన "రైజింగ్ స్టార్" ట్యాగ్ ఒక గౌరవమే అయినప్పటికీ, అది ఆయనపై మరింత బాధ్యతను మోపుతోందని అంటున్నారు. ఎన్ని గ్లోబల్ ఒప్పందాలు కుదిరినప్పటికీ, అవి కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పరిశ్రమలుగా రూపాంతరం చెంది, యువతకు చేతినిండా ఉద్యోగాలు లభించినప్పుడే ఈ హోదాకు పరిపూర్ణత వస్తుందని వ్యాఖ్యానిస్తున్నారు.

# జగన్ లోకేశ్ నే టార్గెట్ చేయడానికి కారణమేంటి?




**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ తన వ్యూహాన్ని మార్చినట్టు కనపడుతుంది. ఇటీవల కాలంలో వైసీపీ ఎక్కువగా కూటమి ప్రభుత్వంలో కీలకంగా ఉన్న నారా లోకేశ్ ను టార్గెట్ చేస్తున్నట్లు కనపడుతుంది. మిగిలిన మంత్రుల కంటే అసలు కింగ్ పిన్ పైనే జగన్ గురి పెట్టారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కూటమి ప్రభుత్వంలో నారా లోకేశ్ కీ రోల్ పోషిస్తున్నారు. భవిష్యత్ లో తనకు లోకేశ్ ప్రధాన ప్రత్యర్థి అని జగన్ కు తెలుసు. అందుకే ఈ మధ్య కాలంలో జగన్ పార్టీ ఎక్కువగా లోకేశ్ ను, ఆయన మంత్రిత్వ శాఖలను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తుంది. అంతేకాదు ఆందోళనలు నిర్వహిస్తూ లోకేశ్ ను రాజకీయంగా ఇబ్బంది పెట్టాలని చూస్తుంది. నిజానికి చంద్రబాబు కంటే జగన్ పార్టీ ఈ రెండేళ్లలో వైసీపీ లోకేశ్ పైనే ఎక్కువ ఫోకస్ పెట్టినట్లు కనపడుతుంది. లోకేశ్ అన్ని శాఖలపై పెత్తనం చేస్తూ మంత్రులను ఉత్సవ విగ్రహాలుగా మార్చేశారంటూ సోషల్ మీడియాలో హోరెత్తిస్తుంది. గత వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ ఇదే తరహాలో సజ్జల రామకృష్ణారెడ్డిని సకల శాఖ మంత్రిగా ఆరోపణలు చేసింది. ఇప్పుడు జగన్ నుంచి దిగువ స్థాయి వైసీపీ నేతల వరకూ లోకేశ్ ను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నారు. లోకేశ్ విదేశీ పర్యటనలపై కూడా వ్యతిరేక వ్యాఖ్యలు చేస్తూ కొంత పార్టీని ఇబ్బంది పెట్టేందుకు జగన్ పార్టీ గత కొంతకాలంగా ప్రయత్నిస్తుందని చెప్పకతప్పదు. చంద్రబాబు అనుభవం ఉన్న నేత. ఆయన మీద విమర్శలు చేస్తే జనం పెద్దగా పట్టించుకోరు. అందుకే లోకేశ్ ను లక్ష్యం చేసుకున్నట్లు అభిప్రాయం వ్యక్తమవుతుంది.

మెగా డీఎస్సీపై ఆందోళనలతో... ఇటీవల మెగా డీఎస్సీలో వైసీపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఉద్యమమే నిర్వహించింది. మెగా డీఎస్సీలో భారీగా అవకతవకలు జరిగాయని, భారీ ఎత్తున ముడుపులు చేతులు మారాయని వైసీపీ ఆరోపిస్తుంది. మంత్రి పదవికి నారా లోకేశ్ రాజీనామా చేయాలని, సీబీఐ చేత మెగా డీఎస్సీపై విచారణ చేయాలని డిమాండ్ చేస్తూ వైసీపీ ఆందోళనలను ప్రతి రోజూ ఏదో రకంగా ఉద్యమ పంథాలో జనంలోకి వెళుతుంది. దీనివల్ల యువత కూడా తమకు చేరువవుతారని వైసీపీ భావించి ఉండవచ్చన్న భావన కలుగుతుంది. లోకేశ్ కు యువత కనెక్ట్ కాకుండా ముందస్తు వ్యూహంతోనే జగన్ పార్టీ ఈ రకమైన ప్రణాళికతో ముందుకు వెళుతున్నట్లు కనపడుతుంది. రానున్న కాలంలో ఇక వైసీపీ లోకేశ్ ను మరింత లక్ష్యంగా చేసుకుని వ్యవహరిస్తుందని పార్టీ నేతలే చెబుతున్నారు. తమపై దాడుల వెనక కూడా లోకేశ్ ఉన్నారని ఆరోపించడం ఇందులో భాగమే.

## ఏకంగా 25 మందిని పెళ్లి చేసుకున్న 'మహానుభావుడు'.. బీజేపీ ఎమ్మెల్యేకే వింత అనుభవం



**హైదరాబాద్ పెన్ పవర్:** ఒక్క పెళ్లి చేసుకుని.. ఆ సంసారాన్ని సర్దుకుని ఈదడానికే సగటు మగాడు ఆపసోపాలు పడుతుంటే... ఈ 'మహానుభావుడు' మాత్రం ఏకంగా 25 మందిని పెళ్లి చేసుకుని వార్తల్లోకెక్కాడు. "ఒక్క పెళ్లి కాదేం దేవుడా" అని కుర్రాళ్ళు దండాలు పెడుతుంటే ఈ అల్లుడు గారు మాత్రం ఏకంగా 'సిల్వర్ జూబ్లీ' వికెట్లు పడేసి అందరికీ మైండ్ బ్లాంక్ అయ్యే షాక్ ఇచ్చాడు. పోనీ ఏమైనా మామూలు మనిషా అంటే కాదు.. సాక్షాత్తూ ఉత్తర్‌ప్రదేశ్ బీజేపీ ఎమ్మెల్యేగారి సొంత అల్లుడు కావడం విశేషం..యూపీకి చెందిన బీజేపీ ఎమ్మెల్యే జ్ఞాన్ తివారీ తన కుమార్తె ప్రజ్ఞకు 2024లో చాలా వైభవంగా పెళ్లి జరిపించారు. అల్లుడు ప్రఖర్ త్రివేది పెద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారి అని.. కోట్లల్లో బిజినెస్ నడుస్తోందని నమ్మి కుమార్తెను ఇచ్చి కన్యాదానం చేశారు. తీరా పెళ్లయిన కొన్ని రోజులకే అల్లుడి ప్రవర్తనపై అనుమానాలు మొదలయ్యాయి. మెల్లగా సోషల్ మీడియా ఖాతాలు, ప్రొఫైళ్ళు తవ్వడం మొదలుపెడితే ఎమ్మెల్యే గారికి ఫ్యూజులు ఎగిరిపోయే నిజాలు బయటపడ్డాయి. అల్లుడు గారు కేవలం రియల్ ఎస్టేట్ బిజినెస్ మాత్రమే కాకుండా 'కళ్యాణ మహోత్సవాల' కాంట్రాక్ట్ కూడా నడుపుతున్నారని తేలింది.మామగారు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. ఈ అల్లుడు గారు మామూలు కిలాడీ కాదు. సోషల్ మీడియాలో రకరకాల ఫేక్ ఐడీలు క్రియేట్ చేయడం.. అమాయక మహిళలతో పరిచయాలు పెంచుకోవడం, చివరికి వారిని పెళ్లి పీటల దాకా తీసుకురావడం ఈయన గారి ప్రధాన శైలి. ఇప్పటివరకు సుమారు 25 మంది మహిళలను వివాహం చేసుకుని వారిని మోసం చేసినట్లు ఎమ్మెల్యే ఆరోపించారు. ఈ మల్టీ-మ్యారేజ్ మాస్టర్ ప్లాన్‌లో అల్లుడు ప్రఖర్‌తో పాటు ఆయన తండ్రి అనుజ్ త్రివేది హస్తం కూడా ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.తన కుమార్తె ప్రజ్ఞను కూడా ఇదే రీతిలో మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకుని మోసం చేశారని జ్ఞాన్ తివారీ పేర్కొన్నారు. అల్లుడి దెబ్బకు షాక్ తిన్న ఎమ్మెల్యే గారు వెంటనే పోలీస్ స్టేషన్‌కు పరుగెత్తి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎఫ్ఐఆర్ నమోదు చేయించారు. ఎమ్మెల్యే ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ప్రస్తుతం యూపీ పోలీసులు ఈ 'మహా పెళ్ళిళ్ల' మిస్టరీని ఛేదించేందుకు రంగంలోకి దిగారు. అసలు నిందితుడు ఎన్ని ఫేక్ ఐడీలు ఉపయోగించాడు.. 25 మంది బాధితులలో అసలైన భార్య ఎవరు.. ఈ పెళ్లిళ్ల వెనుక ఏమైనా ఆర్థిక మోసాలు ఉన్నాయా అనే విషయాలపై విచారణ జరుపుతున్నారు. ఏది ఏమైనా పెళ్లికాని ప్రసాద్‌లు ఒక వైపు బ్రహ్మచారులుగా మిగిలిపోతుంటే.. ఈ అల్లుడు గారు ఏకంగా 25 పెళ్లిళ్లతో రికార్డు సృష్టించడం చూసి సోషల్ మీడియాలో నెటిజన్లు మీమ్స్‌తో విరుచుకుపడుతున్నారు. "ఎమ్మెల్యేగారే అల్లుడి చేతిలో మోసపోయారా!" అని యూపీ ప్రజలు ఆశ్చర్యపోతున్నారు.

## భారత రవాణా రంగంలో ఎలక్ట్రిక్ ఫ్లయింగ్ కార్ సంచలనం



**హైదరాబాద్ పెన్ పవర్:** వైజాగ్ ఆర్కే బీచ్ నుంచి భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ కి రోడ్ మార్గంలో వెళ్లడానికి గంట సమయం పడుతుందని ఒక అంచనా. అలా కాకుండా సముద్రం మీదుగా ప్రయాణించే వెసులుబాటు ఉంటే ఈ సమయం అమాంతం సగానికి పైగా తగ్గిపోతుంది. అలాగే కాకినాడ కోస్టల్ మీదుగా, విశాఖపట్నం వరకూ సముద్రంపైనే ప్రయాణిస్తూ 3-4 గంటల ప్రయాణ దూరం కాస్తా ఒక గంటకే తగ్గిపోవచ్చు. అయితే ఇదే సాధ్యపడాలంటే.. డ్రోన్ టెక్నాలజీ వెహికల్ ఇలాంటి ప్రయాణాలకు సహకరించగలదని సాంకేతిక నిపుణులు ఇప్పటికే సూచించారు. అయితే ఇప్పుడు ఈ కలను నిజం చేసుకోవడానికి ఒక సొంత ఫ్లయింగ్ కార్ ని కొనుగోలు చేయడానికి ఇంకెంతో సమయం పట్టకపోవచ్చు. వైజాగ్ టు భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ కి వెళ్లేందుకు సొంత ఫ్లయింగ్ కారులో ప్రయాణం కావొచ్చు.. లేదా కాకినాడ నుంచి వైజాగ్ - భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రయాణం కావొచ్చు.. ఇలాంటి ఒక ఫ్లయింగ్ కార్ వస్తే, నీలి రంగు సముద్రం మీదుగా రెక్కలు విప్పుకుని ఎగురుతూ ఉంటే, అలాంటి విహంగ వీక్షణం ఎంత బావుంటుందో కదా? ఒకవేళ ఇదే ఫ్లయింగ్ కార్ లో మన ఊరి చుట్టూ ఉన్న ప్రకృతి అందచందాలను వీక్షించాలనుకున్నా అది ఒక అద్భుతమే కదా!అందుకే ఇప్పుడు దేశం మొత్తం ఈ ఫ్లయింగ్ కార్ విజయాన్ని సెలబ్రేట్ చేసుకుంటోంది. ఇంతకీ ఈ వాహనాన్ని కనిపెట్టింది ఎవరు? అంటే.. ఉత్తరాఖండ్‌లోని అల్మోరా జిల్లాకు చెందిన యువ ఆవిష్కర్త రవి టమ్టా. తన స్టార్టప్ -హాపిడా స్కై ప్రైవేట్ లిమిటెడ్- ద్వారా [illegible] సింగిల్-సీటర్ ఎలక్ట్రిక్ ఎగిరే కార్‌ను విజయవంతంగా పరీక్షించారు. కాష్టిఖాన్ అనే గ్రామం నుండి వచ్చిన ఒక యువకుడు ఇటువంటి సంక్లిష్టమైన వైమానిక సాంకేతికతను అభివృద్ధి చేయడం భారతీయ స్టార్టప్ రంగానికి గర్వకారణంగా నిలిచింది. ఈ విజయవంతమైన టెస్ట్ ఫ్లైట్ దేశీయ రవాణా రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలికింది.ఈ సాంకేతికత ప్రధాన విశేషం దీని పర్యావరణహిత స్వభావం. సాధారణ విమానాలు ఏవియేషన్ ఇంధనాలపై ఆధారపడగా హాపిడా స్కై నెక్స్ పూర్తిగా 100 శాతం విద్యుత్ శక్తితో నడుస్తుంది. దీనివల్ల ఎటువంటి కాలుష్య ఉద్గారాలు వెలువడవు. భారీ మోటార్లు, ప్రొపెల్లర్లతో కూడిన మోడిఫైడ్ డ్రోన్ టెక్నాలజీ ఆధారంగా తయారుచేసిన ఈ వాహనం.. భవిష్యత్తులో హరిత రవాణాను అందరికీ అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తోంది.

హిమాలయ ప్రాంతాలైన ఉత్తరాఖండ్‌లో ఈ సాంకేతికత ఎంతో కీలకం కానుంది. కొండచరియలు విరిగిపడటం, వరదలు వంటి ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు కష్టతరమైన రోడ్డు మార్గాలతో సంబంధం లేకుండా ఇది సేవలు అందిస్తుంది. కొండ ప్రాంతాలలో రోడ్డుపై గంట నుండి గంటన్నర పట్టే ప్రయాణ సమయాన్ని ఈ ఎగిరే వాహనం కేవలం 10 నుండి 15 నిమిషాలకు తగ్గించగలదని అంచనా వేస్తున్నారు.అత్యవసర వైద్య సేవలు.. విపత్తు నిర్వహణతో పాటు పర్వత ప్రాంతాల్లో పర్యాటకరంగాన్ని అభివృద్ధి చేయడంలో కూడా ఇది కీలక పాత్ర పోషిస్తుంది. మారుమూల గ్రామాలకు రవాణా సదుపాయాన్ని మెరుగుపరచడం ద్వారా భౌగోళిక అవరోధాలను అధిగమించడానికి ఈ ఎలక్ట్రిక్ కార్ సహాయపడుతుంది. ఇది ఒక పర్యావరణ హితమైన ఎంపిక కావడం వల్ల ప్రకృతి రమణీయమైన పర్వత ప్రాంతాలలో కాలుష్య ప్రభావం లేకుండా ప్రయాణించవచ్చు.ప్రస్తుతం హాపిడా స్కై నెక్స్ తొలి ప్రోటోటైప్ దశను విజయవంతంగా పూర్తి చేసుకున్నా.. కమర్షియల్ వినియోగానికి రాకముందు మరిన్ని భద్రతా పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) నిబంధనల ప్రకారం నాణ్యత, బ్యాటరీ సామర్థ్యం, స్థిరత్వానికి సంబంధించిన పూర్తి అనుమతులు పొందాల్సి ఉంటుంది. అయితే ఈ ప్రయోగం భారతదేశంలో వైమానిక సాంకేతికత- స్వదేశీ ఆవిష్కరణల ప్రతిభకు స్పష్టమైన నిదర్శనంగా నిలిచింది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# హైదరాబాద్‌లో 'విశ్వనాథ్ అండ్ సన్స్' ప్రీ రిలీజ్ వేడుక.. వివరాలివే!




కోలీవుడ్ స్టార్ హీరో సూర్య కథానాయకుడిగా, యువ దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'విశ్వనాథ్ ఢ సన్స్'. ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్, శ్రీకర స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌పై చిత్రబృందం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ సినిమా గ్రాండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఆగస్టు 11వ తేదీన హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్మాతలు తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని జేఆర్సీ కన్వెన్షన్స్ వేదికగా ఈ వేడుక జరగనుంది. ఈ కార్యక్రమానికి హీరో సూర్య ముఖ్య అతిథిగా హాజరుకానుండటంతో అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. తన సినిమా ప్రమోషన్ల కోసం సూర్య హైదరాబాద్ రానుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సినిమాలో సూర్యకు జోడీగా 'ప్రేమలు' చిత్రంతో భారీ క్రేజ్ సంపాదించుకున్న మమిత బైజు కథానాయికగా నటిస్తోంది. వీరిద్దరి కాంబినేషన్ ప్రేక్షకులను ఆకట్టుకోవడం ఖాయమని చిత్ర వర్గాలు భావిస్తున్నాయి. భారీ తారాగణంతో తెరకెక్కుతున్న 'విశ్వనాథ్ ఢ సన్స్' సినిమాలో రాధిక శరత్ కుమార్, రవీనా టాండన్, నాజర్, యోగి బాబు వంటి సీనియర్ నటులతో పాటు భావని శ్రీ, కాళి వెంకట్, రఘుబాబు, వైవా హర్ష కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు జి.వి. ప్రకాశ్ కుమార్ ఈ చిత్రానికి స్వరాలు సమకూరుస్తున్నారు. 'సార్' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న సినిమా కావడం, సూర్య వంటి స్టార్ హీరో నటిస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై మొదటి నుంచీ మంచి బజ్ ఉంది. నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో రిలీజ్ చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ప్రీ రిలీజ్ ఈవెంట్‌తో సినిమా ప్రమోషన్లను అధికారికంగా ప్రారంభించనున్నారు. త్వరలోనే మరిన్ని అప్‌డేట్స్ రానున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది.

# అమెరికాలో డాక్టర్ రాజా కుమారుడి వివాహానికి హాజరైన మంత్రి నారా లోకేశ్



ఏపీ విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, తన అర్ధాంగి నారా బ్రహ్మణితో కలిసి అమెరికాలో జరిగిన ఒక వివాహ వేడుకకు హాజరయ్యారు. గ్లోబల్ ఎన్నారై చీఫ్ డాక్టర్ రాజా కుమారుడి వివాహం అమెరికాలో అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి లోకేశ్ దంపతులు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరై సందడి చేశారు. ఈ సందర్భంగా నూతన వధూవరుల వద్దకు వెళ్లి మంత్రి లోకేశ్, నారా బ్రహ్మణి వారిని మనసారా ఆశీర్వదించారు. వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆనందంగా సాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకలో లోకేశ్ దంపతులు సంప్రదాయ దుస్తులలో కనిపించారు. కార్యక్రమానికి వచ్చిన పలువురితో వారు కాసేపు ముచ్చటించారు. ఈ వేడుకకు సంబంధించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి

# ఆ ప్రాబ్లమ్ వల్లే ప్రమోషన్స్‌కి రాను.. కానీ యశ్ కోసమే నా నియమం బ్రేక్ చేశా: నయనతార



దక్షిణాది చిత్ర పరిశ్రమలో లేడీ సూపర్‌స్టార్‌గా తిరుగులేని క్రేజ్ సంపాదించుకున్న నయనతార, తన సినిమాల ప్రమోషన్లకు దూరంగా ఉంటారనే విషయం అందరికీ తెలిసిందే. ప్రీ-రిలీజ్ ఈవెంట్లు, ఇంటర్వ్యూలకు ఆమె హాజరుకావడం చాలా అరుదు. అయితే, తన ఈ నియమాన్ని పక్కనపెట్టి, నిన్న జరిగిన 'టాక్సిక్' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు ఆమె హాజరై అందరినీ ఆశ్చర్యపరిచారు. తాను ఎందుకు వచ్చానో కూడా ఈ వేదికపై ఆమె స్వయంగా వెల్లడించారు. ఈ సందర్భంగా నయనతార మాట్లాడుతూ.. "నేను ప్రమోషనల్ ఈవెంట్లకు హాజరుకాకూడదని కాదు. నాకు ఆ పని సరిగ్గా చేతకాదు. అందుకే వాటికి దూరంగా ఉంటాను. కానీ, ఈ కార్యక్రమానికి రావడానికి హీరో యశ్ ఒక్కరే కారణం. ఆయన ఒక్క ఫోన్ కాల్ చేశారు, ఈ ఈవెంట్‌కు రావడానికి నాకు అది చాలు" అని తెలిపారు. కేవలం యశ్ కోసమే తాను ఈ కార్యక్రమానికి వచ్చానని స్పష్టం చేశారు. యశ్‌తో కలిసి పనిచేసిన అనుభవం గురించి చెబుతూ.. "చాలా మంది పెద్ద స్టార్స్ ఉంటారు. కానీ, యశ్‌ను మొదటిసారి కలిసినప్పుడు, తెరపై ఆయనకున్న లార్జర్-దెన్-లైఫ్ ఇమేజ్ నిజ జీవితంలో కూడా కనిపించింది. ఆయన వ్యక్తిత్వం కూడా అంతే గొప్పది" అని ప్రశంసించారు. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహించిన 'టాక్సిక్' చిత్రంలో యశ్, నయనతారతో పాటు కియారా అద్వానీ, తారా సుతారియా, హ్యూమా ఖురేషి కీలక పాత్రల్లో నటించారు. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇంగ్లీష్, కన్నడ భాషల్లో ఏకకాలంలో చిత్రీకరించిన ఈ సినిమాను తెలుగు, తమిళం, హిందీ, మలయాళంలో డబ్ చేసి రిలీజ్ చేయనున్నారు.

# 'గోపి' ఎగిరిపోయింది.. ఆచూకీ చెబితే రూ.21 వేలు!

**తప్పిపోయిన పెంపుడు చిలుక కోసం మాజీ సైనికుడి ఆవేదన**

**పట్టిస్తే రూ.21,000 బహుమతిగా ఇస్తానని ప్రకటన**

**చిలుక తిరిగి వచ్చే వరకు నిరాహార దీక్ష చేస్తానని శపథం**

**యజమాని భావోద్వేగభరిత వీడియో సోషల్ మీడియాలో వైరల్**

**చిలుక క్షేమంగా తిరిగి రావాలని ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు**



తాను ప్రాణానికి ప్రాణంగా పెంచుకున్న పెంపుడు చిలుక దూరమవడంతో ఓ రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి తీవ్ర ఆవేదనకు గురయ్యారు. దాని ఆచూకీ తెలిపిన వారికి రూ. 21,000 నగదు బహుమతి ఇస్తానని ప్రకటించారు. అంతేకాకుండా, తన చిలుక తిరిగి వచ్చే వరకు నిరాహార దీక్ష చేస్తానని కన్నీటితో చెప్పిన ఆయన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ అసాధారణ ఘటన మధ్యప్రదేశ్‌లోని షాడోల్ జిల్లా సోహాగ్‌పూర్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. సోహాగ్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బంగాంగా మేళా గ్రౌండ్ సమీపంలో నివసించే చందన్ మిశ్రా అనే రిటైర్డ్ సైనికుడు, ఏడాది క్రితం అమర్‌కంటక్ నుంచి ఓ రామచిలుక పిల్లను తెచ్చుకున్నారు. దానికి 'గోపి' అని పేరు పెట్టి అల్లారుముద్దుగా పెంచుకున్నారు. కుటుంబ సభ్యులతో ఎంతో స్నేహంగా మెలిగే ఈ చిలుక, వారి గొంతులను అనుకరిస్తూ కొన్ని పదాలు కూడా మాట్లాడటం నేర్చుకుంది. శనివారం మధ్యాహ్నం ఇంట్లోని పిల్లలు గోపితో ఆడుకుంటుండగా, అది అకస్మాత్తుగా ఎగిరిపోయింది. సాయంత్రం వరకు తిరిగి వస్తుందని ఎదురుచూసినా ఫలితం లేకపోయింది. చుట్టుపక్కల ఇళ్లు, చెట్లపై వెతికినా దాని ఆచూకీ లభించలేదు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన మిశ్రా కుటుంబం, దాని ఆచూకీ చెబితే రూ. 11,000 బహుమతి ప్రకటించింది. ఆదివారం దాన్ని రూ. 21,000కు పెంచుతూ సోషల్ మీడియాలో వీడియో విడుదల చేశారు. మెడ చుట్టూ నల్లటి రింగ్, వీపుపై ప్రత్యేకమైన ఈకలు ఉన్న గోపిని గుర్తించేందుకు వీలుగా పోస్టర్లనుద

కూడా విడుదల చేశారు. తన చిలుక క్షేమంగా తిరిగి రావాలని కోరుతూ ప్రత్యేక హవనం, పూజలు నిర్వహించేందుకు ఓ పండితుడిని కూడా సంప్రదించినట్లు మిశ్రా తెలిపారు. పెంపుడు జంతువుపై ఓ మాజీ సైనికుడు చూపిస్తున్న ప్రేమ, ఆయన ఆవేదన నెటిజన్ల హృదయాలను కదిలిస్తోంది. చాలా మంది ఈ వీడియోను షేర్ చేస్తూ, గోపి త్వరగా తన యజమాని వద్దకు చేరాలని ఆకాంక్షిస్తున్నారు.

# మహేశ్ బాబుకు బర్త్ డే విషెస్ తెలిపిన సీఎం చంద్రబాబు



టాలీవుడ్ సూపర్ స్టార్ మహేశ్ బాబు 51వ పుట్టినరోజు సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మహేశ్ ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని, ఆయన చేపట్టే అన్ని కార్యక్రమాల్లో విజయం సాధించాలని చంద్రబాబు ఆకాంక్షించారు. ఈ ఏడాది ఆయనకు అద్భుతంగా సాగాలని కోరుకుంటున్నట్లు సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు.

సీఎంతో పాటు టాలీవుడ్ సినీ ప్రముఖుల నుంచి కూడా మహేశ్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. మెగాస్టార్ చిరంజీవి, పవన్ కల్యాణ్, విక్టరీ వెంకటేశ్ వంటి అగ్ర తారలు ఆయనకు విషెస్ తెలియజేశారు. భారతీయ సినిమాలో అత్యంత అభిమానం పొందిన నటులలో ఒకరిగా మహేశ్ ఎదగడం గర్వంగా ఉందని చిరంజీవి అన్నారు. మహేశ్ అందిస్తున్న సేవా కార్యక్రమాలు, ముఖ్యంగా పిల్లలకు సహాయం చేయడం స్ఫూర్తిదాయకమని పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ ప్రశంసించింది. వెంకటేశ్ అయితే 'నా చిన్నోడు మహేశ్' అంటూ ఆప్యాయంగా సంబోధిస్తూ, రాబోయే 'వారణాసి' చిత్రంలోని రుద్ర లుక్‌లో మహేశ్ అదరగొడుతున్నాడని కితాబిచ్చారు. ఈ సినిమాతో మహేశ్ వచ్చే ఏడాది ప్రపంచాన్ని ఏలడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు.

ప్రస్తుతం మహేశ్ బాబు, దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో 'వారణాసి' ప్రాజెక్ట్‌లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఆయన లుక్స్ సినిమాపై అంచనాలను భారీగా పెంచేశాయి. మరోవైపు, అభిమానులు తమ హీరో పుట్టినరోజును పాత చిత్రాల రీ-రిలీజ్‌లు, ప్రత్యేక కార్యక్రమాలతో సోషల్ మీడియాలో ఘనంగా జరుపుకుంటున్నారు.

# లాల్ దర్వాజా బోనాల్లో విజయ్ దేవరకొండ సందడి.. అమ్మవారిని దర్శించుకున్న స్టార్ హీరో!



హైదరాబాద్‌లో బోనాల పండుగ వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. నగరంలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ పాతబస్తీలోని ప్రసిద్ధ లాల్ దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనతో పాటు సోదరుడు, నటుడు ఆనంద్ దేవరకొండ, ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కూడా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

బోనాల పండుగ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఈ ముగ్గురూ అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని ఆశీస్సులు అందుకున్నారు. విజయ్ దేవరకొండ, సందీప్ రెడ్డి వంగా కలిసి ఆలయానికి రావడంతో అక్కడి వాతావరణం మరింత సందడిగా మారింది. తమ అభిమాన హీరో వచ్చాడని తెలుసుకున్న ఫ్యాన్స్, స్థానిక యువత ఆయన్ను చూసేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దర్శనం అనంతరం బయటకు వస్తున్న విజయ్ దేవరకొండను ఫోటోలు తీసేందుకు అభిమానులు ఎగబడ్డారు. దీంతో ఆలయ పరిసరాల్లో కాసేపు కోలాహలం నెలకొంది. ప్రతి ఏటా జరిగే బోనాల ఉత్సవాల్లో సామాన్య భక్తులతో పాటు సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొని అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

# హైదరాబాద్‌లో 40 లక్షల ఓట్లు గల్లంతు?.. ఓటర్ల జాబితా సర్వేతో భారీ మార్పులు!

రాజధాని హైదరాబాద్ నగరంలో ఓటర్ల సంఖ్యలో భారీ మార్పులు చోటుచేసుకోబోతున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సర్వే (ాx=) కారణంగా గ్రేటర్ పరిధిలో ఏకంగా 40 లక్షల ఓట్లు జాబితా నుంచి తొలగిపోయే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. రేపటితో ఈ సర్వే కార్యక్రమం ముగియనుండగా, నిన్నటి వరకు ఉన్న సమాచారం ప్రకారం రాజధానిలోని మూడు జిల్లాల పరిధిలో ఉన్న 28 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 1.14 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో దాదాపు మూడో వంతు ఓట్లు రద్దయ్యే సూచనలు కనిపిస్తుండటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ సెలవులు ఉన్నప్పటికీ ఆది, సోమవారాల్లో బూత్ స్థాయి అధికారుల (బీఎల్ఓ) నుంచి ఉన్నతాధికారుల వరకు విధుల్లోనే ఉంటారని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ స్పష్టం చేశారు. ఇప్పటివరకు ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించని ఓటర్లు ఎవరైనా ఉంటే వెంటనే అందజేయాలని ఆయన సూచించారు. క్షేత్రస్థాయిలో సర్వే పూర్తి చేసి, ఈ నెల 17న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించేందుకు అధికారులు వేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

**సనత్‌నగర్‌లో సగానికి పైగా ఓట్లు రద్దు!**

ఓట్ల తొలగింపు ప్రభావం దాదాపు అన్ని నియోజకవర్గాల్లో ఉన్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో ఇది అత్యధికంగా ఉంది. ముఖ్యంగా సనత్‌నగర్ నియోజకవర్గంలో మొత్తం 2,54,030 ఓట్లు ఉండగా, వాటిలో ఏకంగా 1.16 లక్షల ఓట్లు (45.68%) రద్దయ్యే అవకాశం ఉందని అంచనా. అదేవిధంగా జూబ్లీహిల్స్‌లో 44.21%, ఎల్బీనగర్‌లో 42.19%, ఉప్పల్‌లో 40.05%, మహేశ్వరంలో 40.03% ఓట్లు జాబితా నుంచి తొలగిపోవచ్చని అధికారులు చెబుతున్నారు. అత్యల్పంగా ఇబ్రహీంపట్నంలో 21.43% ఓట్లు రద్దయ్యే అవకాశం ఉంది. రాబోయే రెండు రోజుల్లో ఈ సంఖ్యల్లో స్వల్ప మార్పులు మాత్రమే ఉండొచ్చని భావిస్తున్నారు.

**ఓట్ల తొలగింపునకు కారణాలేంటి?**

దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఉపాధి, ఇతర అవసరాల కోసం ప్రతిరోజూ వేలాది మంది హైదరాబాద్‌కు వలస వస్తుంటారు. ఇక్కడే స్థిరపడి ఓటరుగా నమోదు చేసుకుంటారు. అయితే, ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఓటరు సర్వే జరుగుతున్న నేపథ్యంలో.. సొంత ఊరితో పాటు హైదరాబాద్‌లోనూ ఓటు హక్కు ఉన్నవారు తమ ఓటును సొంతూరిలోనే కొనసాగించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో నగరంలో ఎన్యుమరేషన్ ఫారాలను చాలామంది అధికారులకు తిరిగి ఇవ్వలేదని తెలుస్తోంది. ఇదే ఓట్ల సంఖ్య భారీగా తగ్గడానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. మరోవైపు కొందరు అధికారుల నిర్లక్ష్యం కారణంగా తమకు ఇప్పటికీ ఎన్యుమరేషన్ ఫారాలు అందలేదని లక్షలాది మంది ఓటర్లు ఆరోపిస్తున్నారు. ఇలాంటి వారంతా ఆన్‌లైన్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. సోమవారం గడువు ముగిసిన తర్వాత తుది లెక్కలు తేలనుండగా, ఆగస్టు 17న వెలువడనున్న ముసాయిదా జాబితాపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# తులసి మొక్కని ఎప్పుడు పూజించాలి, బెస్ట్ టైం ఏది.. ఇవి పాటిస్తే ఇంట్లో లక్ష్మీదేవి ఉన్నట్లే..

హిందూ మతంలో తులసి మొక్కకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది, చాలామంది తులసి మొక్కలో లక్ష్మీదేవి కొలువై ఉంటుందని చెబుతారు. అంతేకాకుండా, ఎవరైతే రోజు తప్పకుండా తులసి మొక్కని పూజించి, నీరు పోస్తారో... వారికి లక్ష్మీదేవి ఆశీస్సులు ఉంటాయి. అందుకే పెద్దలు "ఇంట్లో తులసి ఉంటే, లక్ష్మీదేవి ఉన్నట్టే" అని అంటారు. జ్యోతిష్య శాస్త్రం ప్రకారం, సరైన సమయంలో, నిర్దేశించిన ఆచారాల ప్రకారం తులసి మొక్కని పూజిస్తే దాని పూర్తి ప్రయోజనాలు కలుగుతాయి. అంతేకాకుండా, మీరు పూజా నియమాలను పాటించకపోతే, ఆ ప్రయోజనాలు లభించవు. తులసి మొక్కని పూజించడం, దీపం వెలిగించడం, నీరు పోయడం వంటి ఆచారాలకు సంబంధించి తరచుగా అడిగే ప్రశ్న ఏమిటంటే: ప్రతిరోజూ పూజ చేయడానికి శుభ సమయం ఏది ?.. అని.... తులసి మొక్కని పూజించడానికి అత్యంత శుభ సమయం ఎప్పుడంటే జ్యోతిష్య శాస్త్రం ప్రకారం, తులసి మొక్కని ఉదయం లేదా సాయంత్రం ఏ సమయంలోనైనా పూజించవచ్చు , కానీ పూజకు అత్యంత శుభ సమయం బ్రహ్మ ముహూర్తం నుండి సూర్యోదయం అయిన కొన్ని గంటల వరకు అని భావిస్తారు. ?ూూూ =జూూణ । అల్లం ఆరోగ్యం: అల్లంతో పులుసు.. చట్నీ.. ఇవి తింటే వర్షాకాలంలో అస్సలు ముక్కు కారదు..! ఉదయం 4:00 గంటల నుండి 8:00 గంటల మధ్య తులసిని పూజించడం అత్యంత శుభ ఫలితాలను ఇస్తుంది. అయితే, ఏదైనా కారణం చేత మీరు ఉదయం పూజ చేయలేకపోతే, సాయంత్రం కూడా చేయవచ్చు. ఈ సమయంలో మీరు తులసి మొక్కకి నీరు పోయకూడదు. అలాగే మధ్యాహ్నం పూట, గ్రహణం సమయంలో తులసిని పూజించడం మానుకోవాలి.



**తులసి మొక్కలో దీపం ఎప్పుడు వెలిగించాలి ?**

మీరు బ్రహ్మ ముహూర్తంలో తులసి మొక్క ముందు దీపం వెలిగించవచ్చు. సూర్యాస్తమయం తర్వాత తులసి మొక్క ముందు నెయ్యి దీపం వెలిగించి హారతి (పవిత్ర ప్రార్థన) కూడా ఇవ్వవచ్చు. ఇది ఇంట్లో సానుకూల శక్తిని నిలుపుతుంది ఇంకా విష్ణుమూర్తి, లక్ష్మీదేవి ఇద్దరి ఆశీస్సులను ప్రసాదిస్తుంది. తులసి మొక్క దగ్గర దీపం వెలిగించడానికి అత్యంత శుభ సమయం సూర్యాస్తమయం తర్వాత, కానీ ఈ సమయంలో తులసి మొక్కను తాకకూడదు.

**తులసి మొక్కకు నీరు పోయడానికి అత్యంత శుభ సమయం**

మీరు బ్రహ్మ ముహూర్తంలో ఉదయం పూట తులసి మొక్కకు నీరు పోయొచ్చు. ఈ సమయంలోనే తులసి మొక్క అత్యధిక శక్తిని కలిగి ఉంటుంది, మీ జీవితంపై కూడా సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. సూర్యాస్తమయం తర్వాత లేదా రాత్రిపూట తులసి మొక్కకు ఎప్పుడూ నీరు పోయకూడదు. ఇలా చేయడం వల్ల మీ పూజ పూర్తి ప్రయోజనాలు లభించవు, పైగా లక్ష్మీదేవికి కోపం కూడా రావచ్చు.

# బర్త్ డే నాడు మహేశ్ బాబు డబుల్ ట్రీట్.. కుటుంబం విషెస్, సినిమా అప్‌డేట్

సూపర్‌స్టార్ మహేశ్ బాబు నేడు తన పుట్టినరోజు జరుపుకుంటున్నారు. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని ఆయన అభిమానులకు డబుల్ ట్రీట్ లభించింది. ఒకవైపు కుటుంబ సభ్యులు సోషల్ మీడియా వేదికగా ప్రేమపూర్వక శుభాకాంక్షలు తెలుపగా, మరోవైపు మహేశ్ నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'వారణాసి' నుంచి ఫస్ట్ లుక్ విడుదలైంది. ఈ చిత్రంలో మహేశ్ 'రుద్ర' అనే శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారు.మహేశ్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఆయన భార్య నమ్రత శిరోద్కర్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక అందమైన ఫ్యామిలీ ఫొటోను పంచుకున్నారు. మహేశ్, పిల్లలు గౌతమ్, సితారలతో కలిసి ఉన్న ఫొటోను పోస్ట్ చేస్తూ, "హ్యాపీ బర్త్ డే వీదీ! ప్రతి రోజును ప్రత్యేకంగా మార్చినందుకు ధన్యవాదాలు. ఈ ఏడాది నీకు ప్రేమ, ఆరోగ్యం, అనంతమైన సంతోషం లభించాలని కోరుకుంటున్నాను. నిన్ను ఎంతగానో ప్రేమిస్తున్నాం" అని రాసుకొచ్చారు. కుమార్తె సితార కూడా తండ్రికి ముద్దు పెడుతున్న ఫొటోను షేర్ చేస్తూ, "హ్యాపీ బర్త్ డే నాన్న. ఎప్పటికీ నా ఫేవరెట్ పర్సన్ మీరే" అని తన ప్రేమను వ్యక్తపరిచింది.మరోవైపు అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'వారణాసి' చిత్రం నుంచి మేకర్స్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. వెదురు తెప్పపై ప్రశాంతంగా కూర్చున్న మహేశ్, మరో పోస్టర్‌లో అడవి మధ్యలో ప్రకృతిని చూస్తూ నిల్చున్న లుక్స్ విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. "రుద్ర అంటే కేవలం భయంకరమైనవాడు మాత్రమే కాదు" అనే క్యాప్షన్‌తో ఈ లుక్‌ను విడుదల చేశారు.

ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి 'రుద్ర' పాత్ర గురించి ఒక సుదీర్ఘమైన, ఆసక్తికరమైన నోట్‌ను పంచుకున్నారు.



"రుద్ర ఒక గొప్ప ఉద్దేశ్యాన్ని నెరవేర్చడానికి పుట్టాడు. తను అడగని ఒక విధిని మోస్తున్నాడు. అతను చమత్కారి, సున్నితమైనవాడు, అదే సమయంలో భయంకరమైనవాడు. మహేష్ ఆ పాత్రకు ప్రాణం పోశాడు. భయంకరంగా ఎవరైనా నటించగలరు, కానీ భయంకరంగా, సున్నితంగా ఒకేసారి నటించడం చాలా కొద్దిమందికే సాధ్యం" అని రాజమౌళి పేర్కొన్నారు.ఆఫ్రికా షెడ్యూల్ అనుభవాలను వివరిస్తూ.. "ఈ ఫ్రేమ్స్ ఆఫ్రికా షెడ్యూల్‌లోనివి. కిలిమంజారో, మసాయ్ మారా ప్రాంతాల్లో షూటింగ్ చేస్తున్నప్పుడు నేను ఆశ్చర్యపోయాను. అక్కడి ప్రకృతి సౌందర్యాన్ని 1.43:1 ఐమాక్స్ ఫ్రేమ్‌లో కూడా బంధించలేమని కొన్ని ఉదయాలు అనిపించింది" అని రాజమౌళి తెలిపారు. మొత్తంగా పుట్టినరోజున ఫ్యామిలీ విషెస్‌తో పాటు సినిమా అప్‌డేట్ రావడంతో మహేశ్ అభిమానులు పండగ చేసుకుంటున్నారు.

# ట్రంప్ కొత్త హెయిర్‌స్టైల్‌పై రచ్చ.. సోషల్ మీడియాలో మీమ్స్ వెల్లువ!



లాస్ వెగాస్‌లో కొత్త హెయిర్‌స్టైల్‌తో కనిపించిన డొనాల్డ్ ట్రంప్

ఆయన జుట్టుపై సోషల్ మీడియాలో మీమ్స్, జోకులు వైరల్

ట్రంప్ లుక్‌పై ఆయన సోదరుడి కుమార్తె మేరీ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

చిత్తవైకల్యంతో బాధపడిన తన తండ్రిని ట్రంప్ గుర్తుచేశారని వ్యాఖ్య

ట్రంప్ జుట్టుపై ఏఐ జనరేటెడ్ వీడియో కూడా ఆన్‌లైన్‌లో హల్‌చల్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తన హెయిర్‌స్టైల్‌తో వార్తల్లో నిలిచారు. ఇటీవల లాస్ వెగాస్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన సరికొత్త లుక్‌తో కనిపించారు. గతంలో కంటే భిన్నంగా, మరింత ఒత్తుగా, బంగారు రంగులో మెరిసిపోతున్న ఆయన జుట్టు అందరి దృష్టినీ ఆకర్షించింది. ఆయన తన ప్రసంగంలో ఆర్థిక విజయాల గురించి మాట్లాడుతున్నప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం ఆయన కొత్త హెయిర్‌స్టైల్‌పైనే చర్చ మొదలైంది.ఆగస్టు 5న లాస్ వెగాస్‌లోని రెడ్ రాక్ క్యాసినోలో జరిగిన కార్యక్రమంలో ట్రంప్ పాల్గొన్నారు. అయితే, ఆయన ప్రసంగం కంటే ఆయన తలకట్టే పెద్ద హాట్ టాపిక్‌గా మారింది. నెటిజన్లు ఆయన కొత్త లుక్‌పై మీమ్స్, జోకులతో హోరెత్తించారు. కొందరు "ట్రంప్ పెద్ద జుట్టు మీమ్స్ హద్దులు దాటాయి" అని కామెంట్ చేయగా, మరికొందరు "ట్రంప్ వయసు వెనక్కి వెళ్తోందనడానికి ఇదే నిదర్శనం. ఆయన హెయిర్ అద్భుతంగా ఉంది" అని ప్రశంసించారు. మరోవైపు ట్రంప్ విగ్గు పెట్టుకున్నారని సెటైర్లు పేలాయి. "ది న్యూ ట్రంప్ హెయిర్ సీరమ్" పేరుతో ఒక ఏఐ-జనరేటెడ్ వీడియో కూడా 'ఎక్స్' (ట్విట్టర్)లో వైరల్ అయింది. ఈ నేపథ్యంలో ట్రంప్ తీరుపై ఆయన సోదరుడి కుమార్తె మేరీ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ కొత్త హెయిర్‌స్టైల్ 'రుడాల్ఫ్ ది రెడ్-నోస్డ్ రెయిన్‌డీర్' యానిమేషన్ చిత్రంలోని 'హెర్మీ ది ఎల్ఫ్' పాత్రను గుర్తు చేస్తోందని ఆమె ఎద్దేవా చేశారు. అయితే, ఆ జుట్టు బాగుందా లేదా అనే విషయం తనకు అనవసరమని స్పష్టం చేశారు.అంతటితో ఆగకుండా ట్రంప్ తన జుట్టుపై చూపిస్తున్న శ్రద్ధ.. అల్జీమర్స్ బాధపడుతూ చనిపోయిన తన తండ్రి ఫ్రెడ్ ట్రంప్‌ను గుర్తు చేస్తోందని మేరీ ఆవేదన వ్యక్తం చేశారు. "మా నాన్నకు అల్జీమర్స్ వచ్చిన తర్వాత తన జుట్టు రాలిపోవడంపై తీవ్రంగా ఆందోళన చెందేవారు. సరిగ్గా సరిపోని విగ్గు ధరించేవారు. తన జుట్టుకు, మీసానికి రంగు వేసుకునేవారు. ఇప్పుడు ట్రంప్ ను చూస్తుంటే ఆయనే గుర్తొస్తున్నారు" అని మేరీ ట్రంప్ ఓ ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలతో ట్రంప్ హెయిర్‌స్టైల్ వ్యవహారం మరింత చర్చనీయాంశంగా మారింది.

# ప్రైవేట్ లేబుల్ వ్యాపారంలోకి ఫ్లిప్కార్ట్.. పిక్డ్ లేబుల్ పేరుతో సొంత ఉత్పత్తులు

పేరుతో సొంత ఉత్పత్తుల అమ్మకం




న్యూఢిల్లీ:ఫ్లిప్‌కార్ట్ తన క్విక్ కామర్స్ విభాగమైన మినిట్స్? ద్వారా పిక్డ్ పేరుతో కొత్త ప్రైవేట్ లేబుల్‌ను లాంచ్ చేసింది. థర్డ్? పార్టీ బ్రాండ్లపై పూర్తిగా ఆధారపడకుండా సొంత ఉత్పత్తులను అందించాలని నిర్ణయించుకుంది. పట్టణ ప్రాంతాలలో ప్రీమియం వస్తువులకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకుంది. రాబోయే రోజుల్లో ఈ రంగంలో పోటీ మరింత తీవ్రతరం కానుంది. బ్లింకిట్ ఇప్పటికే గార్మెట్ పేరుతో సేవలను ప్రారంభించింది. జెప్టో కూడా సెలెక్ట్ పేరుతో ప్రీమియం కిరాణా సేవలను తీసుకువచ్చింది. ఈ విభాగంలో ఇతర కంపెనీలకు దీటుగా నిలవడానికి ఫ్లిప్‌కార్ట్ తన సొంత బ్రాండ్‌ను ప్రవేశపెట్టింది. వినియోగదారులకు వేగంగా నాణ్యమైన సేవలను అందించడమే లక్ష్యంగా ఈ సంస్థలు ముందుకు సాగుతున్నాయి. ఫ్లిప్?కార్ట్? గార్మెట్ కిరాణా మార్కెట్లోకి కూడా అడుగుపెట్టింది. ప్రీమియం, ప్రత్యేక ఆహార ఉత్పత్తులను అమ్మనుంది.

# తిరుమలలో విపరీతమైన భక్తుల రద్దీ.. ఆక్టోపస్ బిల్డింగ్ వరకు క్యూలైన్లు



తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తడంతో కొండపై విపరీతమైన రద్దీ నెలకొంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయి, క్యూలైన్లు బయటకు విస్తరించాయి. గోగర్భం డ్యామ్ సర్కిల్ సమీపంలోని ఆక్టోపస్ భవనం వరకు భక్తులు కిలోమీటర్ల మేర బారులు తీరిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. సర్వదర్శనం టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి దర్శనానికి సుమారు 20 నుంచి 24 గంటల సమయం పడుతోందని అధికారులు వెల్లడించారు. నిన్న (ఆగస్టు 8) మొత్తం 87,658 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 40,606 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 4.13 కోట్లుగా నమోదైంది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు 4.15 లక్షల లడ్డూలను విక్రయించగా, 3.09 లక్షల మందికి అన్నప్రసాదం అందించారు. వారాంతం కావడంతో భక్తుల రద్దీ అనూహ్యంగా పెరిగినట్లు తెలుస్తోంది. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు టీటీడీ అధికారులు తాగునీరు, ఆహారం వంటి సౌకర్యాలు కల్పిస్తూ రద్దీని క్రమబద్ధీకరించే ప్రయత్నాలు చేస్తున్నారు. భారీ రద్దీ నేపథ్యంలో, తిరుమలకు వచ్చే భక్తులు ఈ విషయాన్ని గమనించి తమ ప్రయాణాన్ని ప్రణాళిక చేసుకోవాలని టీటీడీ సూచిస్తోంది.

# నిందితులను అరెస్ట్ చేశాం.. ప్రియాంక కుటుంబానికి న్యాయం చేస్తాం: హోంమంత్రి అనిత

వైద్య విద్యార్థిని ప్రియాంక ప్రమాద ఘటనపై హోంమంత్రి అనిత ఆరా

జిల్లా ఎస్పీతో మాట్లాడి దర్యాప్తు వివరాలు అడిగి తెలుసుకున్న మంత్రి

బాధితురాలి తండ్రికి ఫోన్ చేసి ప్రభుత్వ అండపై భరోసా ఇచ్చారు

నిందితులను ఇప్పటికే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని వెల్లడి

చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసిన మంత్రి



వైద్య విద్యార్థిని ప్రియాంకను కారుతో ఢీకొట్టిన ఘటనపై రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పందించారు. ఈ కేసుకు సంబంధించి జిల్లా ఎస్పీతో ఆమె ఫోన్‌లో మాట్లాడి దర్యాప్తు పురోగతి, తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు.

అనంతరం మంత్రి అనిత.. బాధితురాలు ప్రియాంక తండ్రి వెంకటేశ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఆయనకు ధైర్యం చెప్పి, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు వేగంగా స్పందించారని, నిందితులను ఇప్పటికే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని మంత్రి తెలిపారు.

ఈ ఘటనపై దర్యాప్తును వేగవంతం చేసి, చట్టప్రకారం దోషులకు కఠిన శిక్ష పడేలా చూస్తామని స్పష్టం చేశారు. ప్రియాంక కుటుంబానికి న్యాయం జరిగేలా చూసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని ఆమె హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి పూర్తిస్థాయిలో అండగా నిలుస్తామని హోంమంత్రి పునరుద్ఘాటించారు.

**మనం వాడే వస్తువైనా, ధరించే దుస్తులైనా.. మన శరీరానికి సౌకర్యాన్నిచ్చినప్పుడే.. మనసూ ప్రశాంతంగా ఉంటుంది. ఇంటీరియర్‌కూ ఈ సూత్రం వర్తిస్తుందంటున్నారు నిపుణులు. నచ్చిన ఫర్నిచర్‌తో ఇంటిని అలంకరించుకుంటే.. సౌకర్యవంతంగానే కాదు.. మనసుకూ ఎంత సంతోషంగా ఉంటుందో మాటల్లో చెప్పలేం! పైగా ఎంత సేపైనా అక్కడే ఉండాలనిపిస్తుంది.**

# మూడ్ మార్చేసే ఇంటీరియర్ డిజైనింగ్!



మనం వాడే వస్తువైనా, ధరించే దుస్తులైనా.. మన శరీరానికి సౌకర్యాన్నిచ్చినప్పుడే.. మనసూ ప్రశాంతంగా ఉంటుంది. ఇంటీరియర్‌కూ ఈ సూత్రం వర్తిస్తుందంటున్నారు నిపుణులు. నచ్చిన ఫర్నిచర్‌తో ఇంటిని అలంకరించుకుంటే.. సౌకర్యవంతంగానే కాదు.. మనసుకూ ఎంత సంతోషంగా ఉంటుందో మాటల్లో చెప్పలేం! పైగా ఎంతసేపైనా అక్కడే ఉండాలనిపిస్తుంది. ఇదే పరోక్షంగా మానసిక ఆరోగ్యాన్ని సొంతం చేస్తుందట! అందుకే నచ్చినట్లుగా ఇంటిని అలంకరించుకుంటే.. రోజువారీ ఒత్తిళ్లు, ఆందోళనలు దూరమై హ్యాపీగా ఉండచ్చని పలు అధ్యయనాలూ చెబుతున్నాయి. మరి, ఇంటీరియర్ డిజైనింగ్ మానసిక ఆరోగ్యంపై ఎలాంటి సానుకూల ప్రభావం చూపుతుందో తెలుసుకుందాం రండి..

**గదిని బట్టి.. రంగులు!**

ఇంటి అందాన్ని పెంచడంలో, మనసుకు ఆహ్లాదాన్ని అందించడంలో రంగులది కీలక పాత్ర! నచ్చిన రంగుల్ని ఎంచుకుంటే.. అటు సౌకర్యంగా, ఇటు ప్రశాంతంగా అనిపిస్తుంది. ఈ క్రమంలోనే శరీరంలో డోపమైన్ అనే హ్యాపీ హార్మోన్ విడుదలవుతుంది. తద్వారా సంతోషంగా ఉండగలుగుతాం. అయితే మనకు నచ్చిన రంగుల్ని ఎంచుకుంటే సరిపోదు.. గది అవసరాల్నీ పరిగణనలోకి తీసుకోవాలంటున్నారు నిపుణులు. ఉదాహరణకు.. పడకగదిలో రిలాక్సవుతాం.. కాబట్టి ఇక్కడ మనసుకు ప్రశాంతతను అందించే లేత రంగులు, అందులోనూ ముఖ్యంగా పేస్టల్ షేడ్స్‌ని ఎంచుకోవడం మంచిదంటున్నారు. అదే కిచెన్‌లో పనిచేసే సమయంలో ఉత్సాహంగా, చురుగ్గా ఉంటేనే పనులు సమయానికి పూర్తవుతాయి. కాబట్టి ఈ గదికి ఎరుపు, ఆరెంజ్.. వంటి రంగులు నప్పుతాయంటున్నారు. ఇలా గది ప్రత్యేకతల్ని బట్టి రంగుల్ని ఎంచుకుంటే.. అది ఆటోమేటిక్‌గా మనసుపై సానుకూల ప్రభావం చూపుతుందని నిపుణులు చెబుతున్నారు.



**'బయోఫిలిక్ డిజైన్' తెలుసా?**

ఇంటి అలంకరణ విషయంలో ఒక్కొక్కరికీ ఒక్కో అభిరుచి ఉంటుంది. కొందరు తమ ఇల్లు మోడ్రన్‌గా ఉండాలని కోరుకుంటే.. మరికొందరు వింటేజ్ థీమ్‌ని ఎంచుకుంటుంటారు. అయితే ఎవరి ఇష్టాయిష్టాలెలా ఉన్నా.. బయోఫిలిక్ ఇంటీరియర్ ట్రెండ్ మాత్రం ఇటు ఆరోగ్యాన్నిస్తూనే, అటు మానసిక ప్రశాంతతను, సౌకర్యాన్ని సొంతం చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇందుకు కారణం.. ఈ డిజైనింగ్ కోసం వాడే అలంకరణ వస్తువులన్నీ పర్యావరణహితమైన ఉత్పత్తులతో తయారుచేయడమే! చెక్క, మట్టి, ఓక్ చెట్టు బెరడు, రాటెన్ (ఇదో రకమైన కలప), ఉన్ని.. వంటి ప్రకృతి అందించే మెటీరియల్స్‌ని ఈ వస్తువుల తయారీలో ఉపయోగిస్తుంటారు డిజైనర్లు. బయోఫిలిక్ ఇంటీరియర్‌లో భాగంగా ఇలా గృహాలంకరణ వస్తువులే కాదు.. ఇంట్లోనే గోడకు లేదంటే ఓ మూలన చిన్నపాటి గార్డెన్‌లా పచ్చదనాన్ని ఏర్పాటుచేసుకోవడం, ప్రకృతి రమణీయతతో కూడిన ఆర్ట్‌వర్క్‌కి ఇంట్లో చోటివ్వడం.. వంటివీ దీని కిందకే వస్తాయి. ఈ తరహా ఫర్నిచర్/గృహాలంకరణ వస్తువులతో మానసిక ఒత్తిళ్లు, ఆందోళనలు తగ్గి.. ప్రశాంతత చేకూరుతుందని పలు అధ్యయనాల్లోనూ తేలింది.



**వెలుతురు..ఓఎక్కడెలా?**

వెలుతురు కూడా మన మనసును ప్రభావితం చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. అందులోనూ సహజసిద్ధమైన లైటింగ్ కీలక పాత్ర పోషిస్తుందట! అయితే చాలామంది వేడిగా ఉందని, దుమ్ము వస్తుందని.. పగటి పూటే తలుపులు, కిటికీలు మూసేసి.. వెలుతురు కోసం లోపలి లైట్లను ఉపయోగిస్తుంటారు. కానీ పగటి పూట వచ్చే న్యాచురల్ లైటింగ్‌ని ఇలా అడ్డుకోకుండా పూర్తిగా ఆస్వాదించినప్పుడే మనసుకు సాంత్వన చేకూరుతుందని నిపుణులు చెబుతున్నారు. అందుకే పగటి పూట తలుపులు, కిటికీలు తీసే ఉంచడం మంచిది. అవసరమైతే వాటికి పల్చటి కర్టెన్లు వేలాడదీస్తే.. వేడి, దుమ్ము బెడద లేకుండా ఉంటుంది.. ఇంట్లో వెలుతురు కూడా పడుతుంది. ఇక రాత్రి పూట ఇంట్లో ఉపయోగించే లైటింగ్ కూడా గది అవసరాల్ని బట్టి ఉండాలంటున్నారు నిపుణులు.



లివింగ్ రూమ్‌లో ఎక్కువ సమయం గడుపుతుంటాం కాబట్టి ఈ గదిలో ప్రకాశవంతమైన లైట్లను ఏర్పాటుచేసుకోవాలి. ఇక గోడలపై ఏర్పాటుచేసిన ఫొటో ఫ్రేములు, ఆర్ట్ వర్క్‌పై మినీ స్పాట్ లైట్లను ఏర్పాటుచేసుకుంటే గదికి అందమొస్తుంది.. మనసుకు ఆహ్లాదంగానూ అనిపిస్తుంది. అదే పడకగదిలో లైటింగ్ ఎంత తక్కువగా ఉంటే మనసుకు అంత ప్రశాంతంగా ఉంటుందంటున్నారు నిపుణులు. పుస్తకాలు చదువుకోవడానికి, వర్క్ చేసుకోవడానికి టేబుల్ ల్యాంప్స్‌ని ఉపయోగించచ్చు.

ఇక డైనింగ్ టేబుల్‌పై షాండ్లియర్/పెండెంట్ లైటింగ్ ఏర్పాటుచేసుకుంటే.. ఆ గదికి ఆ లైటింగ్ సరిపోతుంది. లైట్ల ఫోకస్ ఎక్కువగా లేకుండా ప్రశాంతమైన భావన కలుగుతుంది.

ఇక కిచెన్‌లోనూ లైటింగ్ ప్రకాశవంతంగా ఉండాల్సిందే! అయితే దీంతో పాటు క్యాబినెట్స్, అరల్లో స్పాట్ లైట్లను ఏర్పాటుచేసుకుంటే.. అక్కడి వస్తువులు సులభంగా వాడుకోవడానికి వీలుగా ఉంటుంది.. కంఫర్టబుల్‌గానూ అనిపిస్తుంది. ఇది పరోక్షంగా మానసిక ప్రశాంతతనూ పెంచుతుంది.

**గోడలకు.. 'డోపమైన్' టచ్!**

ఇంటి అలంకరణ అనగానే చాలామంది గోడల పైనే తమ దృష్టి కేంద్రీకరిస్తారు. తమకు నచ్చిన చిత్రాల్ని గోడలకు తగిలించడం లేదంటే చక్కటి వాల్ ఆర్ట్ వేయించుకోవడం, వాల్‌పేపర్‌ని అతికించుకోవడం.. ఇలా ఎవరి స్టైల్ వారిది! అయితే అందులోనూ 'అబ్‌స్ట్రాక్ట్ పెయింటింగ్ (వాస్తవికతకు సంబంధం లేకుండా గీసే చిత్రకళ)', 'పర్సనలైజ్‌డ్ ఆర్ట్ (వ్యక్తిగత అభిరుచులు, జ్ఞాపకాలతో చిత్రాల్ని రూపొందించడం)'.. వంటివి మనసుకు ఎక్కువ సంతోషాన్ని, ప్రశాంతతను అందిస్తాయని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. అందుకే వీటిని 'డోపమైన్ డెకార్'గా నిపుణులు పేర్కొంటున్నారు. కాబట్టి ఇలాంటి అలంకరణ వస్తువులతో గోడలకు హంగులద్దితే ఇటు ఇంటికి అందం తీసుకురావచ్చు.. అటు మనసునూ ప్రశాంతంగా ఉంచుకోవచ్చు అంటున్నారు నిపుణులు.

# ఆ కుర్రాడి వయసెంతన్నది అనవసరం.. భారత క్రికెట్‌కు దొరికిన ఆణిముత్యం: బ్రెట్ లీ

- వైభవ్ సూర్యవంశీ వయసుపై చర్చ అనవసరమన్న బ్రెట్ లీ
- భారత క్రికెట్‌కు దొరికిన అద్భుతమైన ఆటగాడని ప్రశంస
- ఐపీఎల్‌లో భయంలేకుండా ఆడి అందరి దృష్టిని ఆకర్షించిన వైభవ్
- ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్లను సైతం సమర్థంగా ఎదుర్కొన్నాడని కితాబు
- భవిష్యత్తులో పేరు, అంచనాలను నిలబెట్టుకోవడం అతడికి సవాల్ అన్న మాజీ పేసర్




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత యువ క్రికెట్ సంచలనం వైభవ్ సూర్యవంశీపై ఆస్ట్రేలియా మాజీ దిగ్గజ పేసర్ బ్రెట్ లీ ప్రశంసల వర్షం కురిపించాడు. వైభవ్ వయసు చుట్టూ జరుగుతున్న చర్చ అనవసరమని, అతనిలో అపారమైన ప్రతిభ ఉందని, భారత క్రికెట్‌కు సుదీర్ఘకాలం సేవలు అందించగలడని అభిప్రాయపడ్డాడు. ఇటీవలే 'బీర్ బైసెప్స్' అనే యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడుతూ బ్రెట్ లీ ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు."భారత్ బయట, ప్రపంచవ్యాప్తంగా అందరూ వైభవ్ వయసు నిజంగా 15 ఏళ్లేనా? అని చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం ఇదే అతిపెద్ద టాకింగ్ పాయింట్. కానీ, అతడి వయసు ఎంతైతే నాకేంటి? 15 అయినా, 17 లేదా 18 అయినా పర్వాలేదు. ఈ కుర్రాడు అద్భుతంగా క్రికెట్ ఆడగలడు. భారత క్రికెట్‌కు దొరికిన గొప్ప ఆటగాడు. భవిష్యత్తులో అతను మరెన్నో గొప్ప విజయాలు సాధించబోతున్నాడు" అని బ్రెట్ లీ పేర్కొన్నాడు.ఐపీఎల్ 2026 సీజన్‌లో వైభవ్ సూర్యవంశీ తన భయంలేని ఆటతీరుతో అందరి దృష్టిని ఆకర్షించాడు. బౌలర్ల పేరు, ప్రతిష్ఠలతో సంబంధం లేకుండా తనదైన శైలిలో భారీ షాట్లతో చెలరేగాడు. అతని అసాధారణమైన బ్యాట్ స్పీడ్, దూకుడైన బ్యాటింగ్ అతన్ని టోర్నమెంట్‌లోని యువ స్టార్లలో ఒకడిగా నిలబెట్టాయి. ఐపీఎల్‌లో కనబరిచిన ఈ అద్భుత ప్రదర్శనతోనే, అతనికి భారత టీ20 జట్టు నుంచి పిలుపు వచ్చింది. ఇంగ్లండ్‌తో సిరీస్‌లో పెద్దగా రాణించకపోయినా, జింబాబ్వే పర్యటనలో అద్భుతంగా పుంజుకుని 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచాడు. ఇది ఎటువంటి ఒత్తిడిలోనైనా రాణించగల అతని సామర్థ్యాన్ని తెలియజేసింది.వైభవ్ బ్యాటింగ్‌లోని పరిణతిని బ్రెట్ లీ ప్రత్యేకంగా ప్రశంసించాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్‌లో అతను చేసిన 97 పరుగుల ఇన్నింగ్స్‌ను గుర్తుచేసుకున్నాడు. "ఆ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్లు నిప్పులు చెరిగే బంతులు వేస్తుంటే, వైభవ్ ఏమాత్రం భయపడకుండా తన ముక్కు మీదుగా హుక్ షాట్లు ఆడాడు" అని కొనియాడాడు. అయితే, ఇంత చిన్న వయసులో అనూహ్యంగా వచ్చిన పేరు ప్రఖ్యాతులు, అంచనాలను తట్టుకుని నిలబడటమే అతడి ముందున్న అతిపెద్ద సవాల్ అని బ్రెట్ లీ అభిప్రాయపడ్డాడు.

# యశస్వి జైస్వాల్ కెరీర్‌ను కాపాడిన ఆ ఘటన.. బయటపెట్టిన రహానే

- 2022 దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో చోటుకున్న ఒక ఘటనను వెల్లడించిన రహానే
- స్లెడ్జింగ్ ఆపకపోవడంతో జైస్వాల్‌ను మైదానం వీడమని ఆదేశించిన కెప్టెన్
- రహానే చర్యతో 4 మ్యాచ్‌ల నిషేధ లేఖను చించేసిన మ్యాచ్ రిఫరీ
- ఈ ఘటన జైస్వాల్ కెరీర్‌కు మేలు చేసిందన్న రహానే
- ఆ ఫైనల్‌లో 265 పరుగులు చేసి జట్టును గెలిపించిన జైస్వాల్




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత యువ సంచలనం యశస్వి జైస్వాల్ కెరీర్ ఆరంభంలోనే ఒక పెద్ద శిక్ష నుంచి ఎలా తప్పించుకున్నాడో సీనియర్ ఆటగాడు అజింక్యా రహానే తాజాగా వెల్లడించాడు. 2022 దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో జైస్వాల్‌పై నాలుగు మ్యాచ్‌ల నిషేధం పడకుండా తాను ఎలా అడ్డుపడ్డానో రహానే వివరించాడు.'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్'కు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో రహానే ఆనాటి ఘటనను గుర్తు చేసుకున్నాడు. వెస్ట్ జోన్ కెప్టెన్‌గా ఉన్న తాను, సౌత్ జోన్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పాడు. మ్యాచ్ సందర్భంగా యశస్వి జైస్వాల్, సౌత్ జోన్ బ్యాటర్ టి. రవి తేజను పదేపదే స్లెడ్జింగ్ చేశాడు. అంపైర్లు హెచ్చరించినా జైస్వాల్ తన ప్రవర్తన మార్చుకోలేదు. దీంతో పరిస్థితి చేయిదాటిపోతుందని భావించిన రహానే, కెప్టెన్‌గా జోక్యం చేసుకున్నాడు."నేను జైస్వాల్‌ను కాసేపు మైదానం విడిచి బయటకు వెళ్లమని చెప్పాను. ప్రశాంతంగా ఆలోచించుకుని మళ్లీ రమ్మని సూచించాను. నా చర్యను చూసిన మ్యాచ్ రిఫరీ వి. నారాయణన్ కుట్టి, అప్పటికే సిద్ధం చేసిన నాలుగు మ్యాచ్‌ల నిషేధ లేఖను చించివేశారు" అని రహానే తెలిపాడు. ఆ సమయంలో తన నిర్ణయం జైస్వాల్‌కు బాధ కలిగించినా, అది అతని కెరీర్‌ను కాపాడిందని రహానే అభిప్రాయపడ్డాడు.కాగా, అదే మ్యాచ్‌లో జైస్వాల్ 265 పరుగులు చేసి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. వెస్ట్ జోన్ ఆ ట్రోఫీని గెలుచుకుంది. ఆ తర్వాత 2023లో జైస్వాల్ భారత జట్టులోకి అరంగేట్రం చేసిన విషయం తెలిసిందే.

# బంగ్లాదేశ్‌తో 3 వన్డేలు, 3 టీ20లు.. కేంద్రం అనుమతి కోసం బీసీసీఐ ప్రయత్నం!




**హైదరాబాద్ పెన్ పవర్:** క్రికెట్ అభిమానులకు మరో ఉత్కంఠభరితమైన సిరీస్ చూసే అవకాశం రాబోతోందా? ఇటీవలి టీ20 వరల్డ్ కప్ వివాదాలు, భద్రతా కారణాల వల్ల రద్దయ్యేలా కనిపించిన భారత్ వర్సెస్ బంగ్లాదేశ్ వైట్ బాల్ సిరీస్‌పై సస్పెన్స్ త్వరలోనే వీడబోతోంది. 3 వన్డేలు, 3 టీ20ల ఈ పరిమిత ఓవర్ల సిరీస్ నిర్వహణకు సంబంధించి భారత ప్రభుత్వ అనుమతి కోరడానికి బీసీసీఐ (దీజజ×) సిద్ధమైంది. మరోవైపు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (దీజదీ) అధ్యక్షుడు తమీమ్ ఇక్బాల్ టీమిండియాను తమ దేశానికి రప్పించేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు.

**వివాదాల నుంచి మళ్లీ ఆశల వైపు:** ముహమ్మద్ యూనస్ నేతృత్వంలోని బంగ్లాదేశ్ ప్రభుత్వం భద్రతా నెపంతో తమ జట్టును భారత్‌కు పంపడానికి నిరాకరించడంతో బీసీబీ, బీసీసీఐల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. అయితే ఇటీవలి భౌగోళిక-రాజకీయ పరిణామాల వల్ల ఈ సిరీస్‌పై మళ్లీ ఆశలు చిగురించాయి. ప్రస్తుతం ఇరు జట్ల క్రికెట్ బోర్డులు నిరంతరం చర్చలు జరుపుతున్నాయి. దీంతో ఈ చర్చలు ఫలించి మళ్లీ సిరీస్ పట్టాలెక్కే అవకాశం క్లియర్ గా కనిపిస్తుంది.

ప్రత్యేక విండో: బంగ్లాదేశ్ బోర్డు ఈ సిరీస్ కోసం ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు ప్రత్యేక విండోను కేటాయించింది.

**కేంద్రం చేతిలోనే చివరి నిర్ణయం:** మేము ఈ సిరీస్‌పై పని చేస్తున్నాం.. బంగ్లాదేశ్ టూర్‌పై కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి, స్పష్టత కోరతాం.. ఆఖరి నిర్ణయం భారత్ సర్కార్‌దే అని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి.

**భద్రతపై తమీమ్ ఇక్బాల్ హామీ:** బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు తమీమ్ ఇక్బాల్ మాట్లాడుతూ.. బంగ్లా అత్యంత సురక్షితమైన దేశం.. భారత్‌తో సిరీస్ అంటే ఇక్కడ ఫ్యాన్స్‌లో విపరీతమైన క్రేజ్ ఉంటుంది. టీమిండియా పర్యటన కోసం నా పరిధిలో అన్ని ప్రయత్నాలు చేస్తున్నాను అని తెలిపాడు.



ప్రకృతి పావని: ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లుయెన్సర్ వర్ధమాన నటిగా మారింది

# మ్యూజికల్ ప్రమోషన్ స్ట్రాటజీ.. ఆడియో, విజువల్ ఫీస్ట్ ఫిక్స్!

భారతీయ చిత్రసీమలో తనదైన డ్యాన్స్ మూమెంట్స్‌తో కుర్రకారును ఊపేస్తున్న ఇద్దరు భామలు జాన్వీ కపూర్, శ్రీలీల మొదటిసారి ఒకే స్క్రీన్‌ను పంచుకోబోతున్నారు. ఉమేష్ బిస్త్ దర్శకత్వంలో రూపుదిద్దుకోనున్న ఓ హిందీ రొమాంటిక్ థ్రిల్లర్ చిత్రంలో వీరిద్దరూ కలిసి నటించనున్నారు. దేశంలోనే టాప్ క్లాస్ డ్యాన్సర్లుగా పేరు తెచ్చుకున్న ఈ ఇద్దరు గ్లామర్ క్వీన్స్ ఒకే సినిమాలో కనిపించబోతుండటంతో ఆడియో మరియు విజువల్ పరంగా ప్రేక్షకులకు పూనకాలు తెప్పించే విందు దక్కడం ఖాయంగా కనిపిస్తోంది. ఆ విశేషాలు చూద్దాం..

**ఒకే ఫ్రేమ్‌లో ఇద్దరు డ్యాన్స్ క్వీన్స్:** శ్రీలీల తన ఎనర్జిటిక్ డ్యాన్స్ స్టెప్పులతో సౌత్‌లో ఇప్పటికే ఊపు ఊపేస్తుండగా, జాన్వీ కపూర్ తన గ్రేస్‌ఫుల్ మూమెంట్స్‌తో బాలీవుడ్‌ను ఏలుతోంది. ఇప్పుడు వీరిద్దరి కాంబినేషన్‌లో డ్యాన్స్ నంబర్స్ మరియు చార్ట్‌బస్టర్ సాంగ్స్ రాబోతుండటంతో అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి.

**మ్యూజికల్ చార్ట్‌బస్టర్ స్కోప్.. ప్రమోషన్ స్ట్రాటజీ:** ఈ చిత్రాన్ని బాలీవుడ్ ప్రముఖ నిర్మాతలు ఏక్తా కపూర్, గునీత్ మోంగా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ బిగ్ ప్రొడ్యూసర్స్ కాంబినేషన్ కావడం వల్ల సినిమా ప్రమోషన్లకు డ్యాన్స్ అండ్ మ్యూజికల్ ఆల్బమ్‌నే ప్రధాన అస్త్రంగా వాడుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇక ఆడియో రిలీజ్ నుంచే మాస్ పాటలు, స్పెషల్ డ్యాన్స్ నంబర్లతో సోషల్ మీడియాను, యూట్యూబ్‌ను షేక్ చేసేలా వినూత్న మ్యూజికల్ ప్రమోషన్ స్ట్రాటజీని ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం.

**ముక్కోణపు ప్రేమకథగా ఉత్కంఠభరితమైన లైన్:** ఇద్దరు అందాల భామలు ఒకే పురుషుడిపై ప్రేమను పెంచుకోవడం, వారి మధ్య ఏర్పడే మానసిక సంఘర్షణ, అసూయ మరియు ఆధిపత్య పోరు నేపథ్యంలో ఈ రొమాంటిక్ థ్రిల్లర్ సాగనుంది. ఇక రొమాన్స్, మిస్టరీ మరియు ఊహించని మలుపులతో కథ నడుస్తుంది.ఇక శ్రీలీలకు బాలీవుడ్‌లో ఇది ఒక పెద్ద మైలురాయి కాగా, సరైన సక్సెస్ కోసం చూస్తున్న జాన్వీకి ఈ ప్రాజెక్ట్ ఎంతో ముఖ్యం కానుంది.

**హీరో ఎవరనేదే ఇప్పుడు అసలు ఆసక్తి:** నవంబర్ నుంచి ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుండగా, హీరోయిన్లను ఖరారు చేసిన మేకర్స్ ప్రస్తుతం హీరో వేటలో ఉన్నారు. బాలీవుడ్‌కు చెందిన కొందరు యంగ్ అండ్ పాపులర్ స్టార్స్‌ను ఈ పాత్ర కోసం పరిశీలిస్తున్నారు. ఇక ఇద్దరు టాప్ డ్యాన్సర్ల మధ్య నటించే ఆ అదృష్టవంతుడైన యంగ్ హీరో ఎవరనేది ప్రస్తుతం బిగ్ సస్పెన్స్‌గా మారింది.

**స్క్రీన్‌పై అదిరిపోయే జాతర:** ఉమేష్ బిస్త్ తెరకెక్కిస్తున్న ఈ ప్రాజెక్ట్ కథాంశంతో పాటు మ్యూజిక్, డ్యాన్స్ పరంగా సంచలనం సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది. ఇక ఏక్తా కపూర్, గునీత్ మోంగా కాంబినేషన్ తెస్తున్న ఈ మ్యూజికల్ విజువల్ థ్రిల్లర్ థియేటర్లలో ఎలాంటి మ్యాజిక్ క్రియేట్ చేస్తుందో చూడాలి.







కియారా అద్వానీ: 'ఫగ్లీ' నుండి 'టాక్సిక్' వరకు -- ఒక తార ప్రయాణం

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965